ప్రజాశక్తి

శనివారం 9 డిసెంబరు 2023 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

తుపాను బాధిత రైతాంగానికి

పూర్తి నష్టపరిహారం చెల్లించాలి

కలెక్టర్ డిల్లీరావుకు సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - విజయవాడ : మిచౌంగ్ తుపాను ధాటికి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావును జిల్లా కమిటీ తరపున కార్యదర్శి డివి.కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్ కలిసి వినతిపత్రం సమర్పించారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి తుపాను అనంతర పరిస్థితిని ఆయనకు వివరించారు. తుపాను ప్రభావంతో జిల్లాలోని రైతాంగం అత్యధికంగా నష్టపోయారని, పంటలు చేతికొచ్చే దశలో ఉన్న వరి, మిర్చి, పత్తి, కూరగాయలు, ఆకుకూరలు, మొక్కజొన్న, పంట పూత దశలో ఉన్న మామిడి తోటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వరి రైతులకు ఎకరానికి రూ.30 వేల నుండి రూ.60 వేల వరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. వారికి పూర్తి పరిహారాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. దెబ్బ తిన్న పంటకు నిబంధనలను ఎత్తివేసి రంగు మారిన, మొక్క వచ్చిన ధాన్యాన్ని ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని, రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. మిర్చి రైతులకు కూడా ఎకరానికి లక్ష రూపాయల నుండి రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. మిర్చి పండించే వారిలో అత్యధికులు పేద, కౌలు రైతులే ఉన్నారని, అత్యధిక వడ్డీకి అప్పులు తెచ్చి సాగు చేశారని వివరించారు. పత్తి రైతులకు ఎకరానికి రూ.20 వేల నుండి రూ.50 వేల వరకు, మొక్కజొన్న పంటకు ఎకరానికి రూ.30 వేల వరకు, మామిడి రైతులకు రూ.30 వేల నుండి రూ.50 వేల వరకు, కూరగాయలు, ఆకుకూరల తోటలకు రూ.30 వేల నుండి రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని కలెక్టర్‌కు వివరించారు. అందువల్ల నష్టపోయిన రైతులందరికీ పూర్తి పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం నాయకులు, కార్యకర్తలు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు జిల్లాలో పర్యటించి తుపాను బాధిత రైతుల నుండి వివరాలు సేకరించారని తెలిపారు. ప్రభుత్వం కూడా శనివారం నుండి సర్వే చేసి నష్టాలను అంచనా వేస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. రైతుల వాస్తవ పరిస్థితులను గమనించి ఉదారంగా వ్యవహరించి పూర్తి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అలాగే తుపాను కారణంగా పనులు కోల్పోయిన వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులకు భతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



కలెక్టర్ డిల్లీరావుకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు డివి.కృష్ణ, శ్రీనివాస్

ఇది ప్రజా విజయం

నిలిచిన నీటి మీటర్ల బిగింపుపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజా ఉద్యమం ఫలితంగా నగరంలో నీటి మీటర్ల బిగింపు నిలిచిపోయిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పేర్కొన్నారు. 24 గంటలూ నీటి సరఫరా పేరుతో మధురానగర్, పసుపు తోటల్లో నీటి మీటర్ల బిగించారని, ప్రజాందోళనలతో లక్ష నీటి మీటర్ల బిగింపు నిలిచిపోయిందని, ఇది ప్రజా విజయమని అన్నారు. అమత్ పథకం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచినీటితో వ్యాపారం చేస్తున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో నీటి మీటర్ల అంశాన్ని ప్రజా అజెండాగా మారుస్తామన్నారు. నగరంలోని మధురానగర్, పసుపు తోట ప్రాంతాల్లో శుక్రవారం సిహెచ్.బాబూరావు, పలువురు సిపిఎం నేతల పర్యటించారు. తొలగించిన నీటి మీటర్లను పరిశీలించారు. స్థానిక ప్రజలను కలిసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానికులు దశలవారీగా చేసిన ఆందోళనతోనూ, విఎంసి కౌన్సిల్ సమావేశంలో సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు నీటి మీటర్లను తొలగించాలని డిమాండ్ చేయడంతోనూ గతంలో బిగించిన నీటి మీటర్లు తొలగించారని గుర్తుచేశారు. ఎంఎల్‌ఎ మల్లాది విష్ణు మీటర్లు బిగించలేదని బుకాయించారని, దీంతో నీటి మీటర్లపై బహిరంగ చర్చకు పసుపు తోటలో సిద్ధమని తాము సవాలు విసిరితే ఎంఎల్‌ఎ విష్ణు వెనక్కితగ్గారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, నాయకులు పి.కష్ణమూర్తి, వై.కష్ణ, బి చిన్నా, రాము, ఎం.రామారావు, నాగరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.



తొలగించిన మీటర్లతో సిపిఎం నేతలు బాబూరావు, రమణారావు

పంట నష్టంపై తుది అంచనాలకు మీనమేషాలు!

ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూపు
మొలకలొస్తున్న వరి కంకులు రైతుల్లో ఆందోళన



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

పంట నష్టం తుది అంచనాలపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దీనిపై ఇప్పటి వరకు అధికారులకు ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు రాకపోవడమే దీనికి నిదర్శంగా ఉంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం సాయంత్రం వరకు క్షేత్రస్థాయిలో నష్టం వివరాల సేకరణ ప్రక్రియ ప్రారంభంకాలేదు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు తగ్గి మూడు రోజులవుతోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లోని పొలాల్లోని నీరు తగ్గింది. ఈ పొలాల్లో నేల వాలిన వరిని కోత కోయడానికి, నూర్చడానికి రైతాంగం సన్నద్ధమవుతోంది. శని, ఆది వారాలు సెలవులు ఉండటంతో అధికారులు నష్టాన్ని లెక్కించేందుకు అవకాశం లేదు.

ఈనెల 5న మిచౌంగ్ తుపాను తీరం దాటింది. మరుసటి రోజు నుంచి వర్షాలు తగ్గాయి. మెరక ప్రాంతాల్లోని పొలాల్లో నీరు తగ్గింది. పల్లపు ప్రాంతాల్లోని పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ముంపు నుంచి బయటపడిన పంట పొలాల్లో రైతులు కోతలు కోసేందుకు, నూర్పిళ్ల చేసేందుకు సిద్ధమవుతున్నారు. అపరాల సాగుకు అదును పోకముందే విత్తనాలు వెదజల్లి కోతలు కోయాలని రైతులు తొందరపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే నేలవాలిన పొలాల్లోని పంటను యంత్రాలతో హార్వెస్టింగ్ (కోత, నూర్పిడి) చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సాధారణ పద్ధతిలోనే కోత కోస్తున్నారు. ఈదురు గాలులు, వర్షానికి నేలకొరిగిన వరి పంటలో కంకుల నుంచి గింజలు రాలడం, పక్వానికి రాకపోవడం తదితర కారణాలతో సగటున ఎకరాకు 7 బస్తాల నుంచి 15 బస్తాల వరకు దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పంట నష్టం అంచనా కట్టడంలో తీవ్ర జాప్యం జరగుతోంది. శుక్రవారం వరకు ఎన్యుమరేషన్ చేపట్టలేదు. శని, ఆదివారాల్లో సెలవులు ఉండటంతో ఈ రెండు రోజులు ఎన్యుమరేషన్ చేసే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో కోతలు, పనలు కట్టేత పూర్తి చేసిన పొలాలకు సంబంధించిన రైతులు ప్రభుత్వ ఇచ్చే పరిహారం పొందేందుకు, బీమా పరిహారం పొందేందుకు అవకాశం ఉండదని రైతులు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్యుమరేషన్ జరగలేదు...!

మొవ్వ మండలం కోసూరుకు చెందిన కౌలు రైతు గుమ్మడి రవీంద్ర రెండెకరాల్లో ఎంటియు 1318 వరి సాగు చేశాడు. నవంబరు 30న పంట కోత కోశాడు. అయితే తుపాను ప్రభావంతో ఈనెల 2, 3 తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు పొలంలోని పనలు పూర్తిగా మునిగిపోయాయి. డ్రయిన్ పూడిపోవడంతో వర్షం తగ్గి మూడు రోజులైనా ముంపు నుంచి బయటపడలేదు. నాలుగు రోజులుగా నీటిలో నానడంతో పనలు కుళ్లిపోయాయి. ధాన్యం కంకులు మొత్తం మొలకలొచ్చాయి. ఈ గ్రామంలోని రైతులందరి పరిస్థితి ఇలాగే ఉంది. ఇదే గ్రామానికి చెందిన మరో కౌలు రైతు గొంతు వెంకటేశ్వరరావు సాగు చేస్తున్న మూడెకరాల పంట పూర్తిగా కంకి తయారవ్వకముందే నేలవాలింది. నేలవాలిన వరిపై నీరు నిలిచింది. దీంతో 10 బస్తాలు కూడా దిగుబడులు రావని, పెట్టిన పెట్టుబడి చేతికి రాదని ఆ కౌలు రైతు వాపోతున్నాడు. ఇప్పటి వరకు తమ పొలాలు ఎన్యుమరేషన్ చేయలేదని చెబుతున్నారు.

ఎన్యుమరేషన్‌కు సన్నాహాలు !

కృష్ణాజిల్లాలో 2 లక్షల 64 వేల 36 ఎకరాల్లోని వివిధ పంటలు దెబ్బతిన్నట్లుగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. దీనిలో అత్యధికంగా 2 లక్షల 58 వేల తొమ్మిది ఎకరాల్లోని వరి పంట ఉంది. నిబంధనల ప్రకారం 33 శాతం మించి నష్టం జరిగిన పంట పొలాలనే పరిగణలోకి తీసుకుని తుది నివేదిక సిద్ధం చేయాల్సి ఉంది. దీని ఆధారంగానే నష్టపోయిన రైతులకు పరిహారం, బీమా అందుతాయి. తుది అంచనాల రూపొందించేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో, డివిజన్‌లో ఆర్‌డిఒ, ఎడిఎ, మండల స్థాయిలో తహశీల్దార్, ఎఒ పర్యవేక్షణల్లో ఎన్యుమరేషన్ ప్రక్రియ చేపట్టేందుకు జిల్లా అధికారులు సన్నాహాలు చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు (వివోఎ)లు, గ్రామ రెవెన్యూ అధికారులు (విఆర్‌ఒ)లు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పంట నష్టం తుది అంచనాలు రూపొందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

19న స్టేడియంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

హాజరుకానున్న సిఎం జగన్

ప్రజాశక్తి - విజయవాడ : సెమీ క్రిస్మస్ వేడుకలకు ఘనంగా నిర్వహించేందుకు భాగస్వామ్యులై వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు క్రైస్తవ మత పెద్దలను కోరారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ డిల్లీరావు, మైనార్టీస్ కమిషన్, ఏపి క్రిస్టియన్ (మైనార్టీస్) ఫైనాన్స్ కార్పొరేషన్, ఆర్‌సియం, సిఎస్ఐ, బాప్టిస్ట్, బిషప్ లూథరన్, సాల్వేషన్ ఆర్మీ, ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ తదితర సంస్థల మత పెద్దలతో సెమి క్రిస్మస్ ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ సాయంత్రం నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే సెమీ క్రిస్మస్ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారన్నారు.

అవనిగడ్డ టిడిపి టికెట్ కోసం శేషగిరిరావు ప్రయత్నం?

ప్రజాశక్తి - అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గం నుండి టిడిపి టికెట్ సాధించడం కోసం న్యాయవాది బడే వెంకట శేషగిరిరావు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. న్యాయవాద వత్తిలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకున్న ఆయన ఆ పార్టీ ప్రముఖుల ద్వారా కషి చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తలు టిడిపి నియోజకవర్గ నేతల్లో ఆందోళన కలిగిస్తున్నట్లు తెలిసింది. కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామానికి చెందిన శేషగిరిరావు కుటుంబం తెలుగుదేశం ఆవిర్భావ నుండి ఆ పార్టీతోనే కొనసాగింది. అంతేకాక ఆయన తండ్రి బడే బాబురావు 2005 నుండి ఉల్లిపాలెం పిఎసిఎస్ అధ్యక్షులుగా పదేళ్లపాటు సేవలందించారు. అనంతరం కూడా వారి కుటుంబం టిడిపిలోనే కొనసాగుతోంది. 1975లో ఉల్లిపాలెంలో జన్మించిన శేషగిరిరావు 1998లో ఎల్‌ఎల్‌బి పూర్తి చేసి అనంతరం అవనిగడ్డలోన్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. న్యాయవాది వత్తిలో దివిసీమ వాసులకు సుపరిచితుడుగా ఉన్న ఆయన రాజకీయ ప్రవేశం చేయడానికి సిద్ధపడుతున్నట్లు తెలిసింది. ఆర్థికంగా వెసులుబాటు కలిగిన శేషగిరిరావు ఆ పార్టీలోని కొందరి ప్రోత్సాహం, పెద్దల సహకారంతో పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి టిడిపి టికెట్ సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇంకా అసెంబ్లీ ఎన్నికలు మరో నాలుగు నెలలు ఉండడంతో టికెట్ కోసం ఎదురు చూసే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. అయితే శేషగిరిరావు అనుయాయులు మాత్రం తప్పకుండా తమకు టికెట్టు వస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు. ఈనేపథ్యంలో ఎవరికి టికెట్ లభిస్తుందో? ఎవరు ప్రజల విశ్వాసాన్ని చూడగలుగుతారో కాలమే నిర్ణయిస్తుంది.



వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వరరెడ్డి (పెదబాబు) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెదబాబు మాట్లాడుతూ తుపాను వల్ల రైతులు చాలా నష్టపోయారని, ప్రభుత్వం తప్పక ఆదుకుంటుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి అర్.సురేష్ మాట్లాడుతూ మిచౌంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన అన్ని పంటలు పరిశీలించి పారదర్శకంగా అంచనా వేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచనలిచ్చారు. సమావేశంలో వివిధ వ్యవసాయ అనుబంధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సమాఖ్య అధ్యక్షులు ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, సభ్యులు వెంకటేశ్వరరావు గ్రామ వ్యవసాయ సహాయకులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో

విస్సన్నపేట : మండలంలోని నరసాపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ సలహా మండల సమావేశం జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు దోర్నాల దామోదర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఇటీవల ఏర్పడిన తుపాను కారణంగా దెబ్బతిన్న వివిధ రకాల వ్యవసాయ, ఉద్యాన పంటల గురించి చర్చించారు. తుఫాను వలన పడిపోయిన పంటలను పరిశీలించారు ఎంపిపి వనజాక్షి రాజేష్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి రాజ్యలక్ష్మి ఉద్యాన అధికారుల నరేంద్ర కుమార్ ఎలక్ట్రిక్ ఏ.ఈ విజయభాస్కర్ సలహా మండల సభ్యులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఉష, భాస్కర్, ఇతర రైతులు హాజరయ్యారు.

మొన్న నీరందక... నేడు నీట మునక

గంపలగూడెం : నెల క్రితం రైతులు పంట పొలాలకు చుక్కనీరు అందక అష్టకష్టాలు పడ్డారు. ఎంత ఖరీదైనా కొనుగోలు చేసేందుకు వెంపర్లాడినా ఫలితం దక్కలేదు. కానీ, నేడు తుపానుతో పండిన పంటలు నీట మునిగి మళ్లీ రైతులకు కష్టాలు తెచ్చాయి. వరి పంటలో నిలిచిన నీటిని పంపించేందుకు అదే రైతులు నేడు పడుతున్న కష్టాలు అంతా ఇంతా కాదు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి రహదాన రహదారి వెంట ఉన్న పొలాల్లో నిలిచిన నీటిని ఇంజన్ల సహాయంతో వెళ్ళగొట్టేందుకు రైతులు ఆపసోపాలు పడుతున్నారు.

మిర్చి తోటల పరిశీలన

ప్రజాశక్తి - గంపలగూడెం : తుపానుతో దెబ్బతిన్న మిర్చి తోటలను ఎన్టీఆర్ జిల్లా ఉద్యానవన అధికారి బాలాజీ కుమార్ పరిశీలించారు. శుక్రవారం మండలంలోని అనుములంక, కనుమూరు, ఊటుకూరు, కొండిజర్ల గ్రామాలు పర్యటించి, పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోయిన పంట పోగ, ఉన్న పంటను కాపాడుకు నేందుకు అవసరమైన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో షహీద్ అహ్మద్, గ్రామ సహాయకులు సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సలహాలు సూచనలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు నగర పంచాయతీ పరిధిలో తుఫాన్‌కు నీట మునిగిన వరి పొలాలను గరికపాడుకు చెందిన వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ (సాయిల్ సైన్స్), పి.మధువాణి శుక్రవారం సందర్శించి రైతులకు సలహాలు సూచనలిచ్చారు. ఉప్పు ద్రావణం తడిచిన పంటపై పిచికారీ చేయడం వల్ల ధాన్యం మొలక కట్టకుండా ఉంటుందని తెలిపారు. ఇప్పటికే కోసి కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా పట్టాలు కప్పి జాగ్రత్త పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్జెక్ట్ మాటర్ స్పెషలిస్ట్ ఎన్.రాజశేఖర్, నగర పంచాయతీ చైర్పర్సన్ గత్తం కస్తూరి బాయి, వైస్ చైర్పర్సన్ గుమ్మా వెంకటేశ్వరమ్మ, కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు, ఎఎంసి డైరెక్టర్ గత్తం నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి పి.పద్మ, రైతులు, రైతు భరోసా సిబ్బంది భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పత్తాలేని అధికారులు

ప్రజాశక్తి - గంపలగూడెం : జిల్లా వ్యాప్తంగా వివిధ పంటలు వర్షాలకు దెబ్బతిని రైతులు అతలాకుతలమైనా అధికారులు పట్టించుకోవడంలేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. గడిచిన మూడు రోజుల నాటి తుఫాను దెబ్బకు రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. ప్రతి మిరప, వరి, మొక్కజొన్న, తదితర పంటలు చూస్తే కంటతడి వస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మద్ది రెడ్డి వెంకటరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని కనీసం ఏ గ్రామంలోనైనా వ్యవసాయ అధికారి బయటకు వచ్చిన దాఖలు లేవని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పంట నష్ట అంచనాలు వేయాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు, దెబ్బతిన్న ప్రతి ఎకరాకు నష్టపరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా కోరారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను కాపాడాలని కోరారు.


చందర్లపాడులో ధర్నా


నందిగామలో మాట్లాడుతున్న కళ్యాణ్

గంపలగూడెంలో...



మైలవరంలో...


కంచికచర్లలో...


తిరువూరులో...


ఇబ్రహీంపట్నంలో...


కంచికచర్లలో పంటను చూస్తున్న ఎంఎల్ఏ

ప్రభుత్వం ఆదుకోవాలి

తుపాను కారణంగా ఎన్‌టిఆర్‌జిల్లాలోని దాదాపు పంటలన్నీ నేలవాలాయి. దీంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల పలుపార్టీల నాయకులు, రైతులు, వ్యవసాయాధికారులు పంట పొలాలను పరిశీలిస్తున్నారు. రైతులకు భరోసానిస్తున్నారు. మరికొన్నిచోట్ల మునిగిన పంటను కనీసం అధికారులు కన్నెత్తైనా చూడటం లేదని రైతులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పండించిన పంటలు నీటమునగటంతో ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని రైతు, కౌలు రైతు సంఘం, సిపిఎం నాయకులు కోరుతున్నారు.

ప్రజాశక్తి - నందిగామ : తుపాను ప్రభావంతో ఎన్టీఆర్ జిల్లాలో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం తక్షణమే రైతులకు అందజేయాలని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట కళ్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం నందిగామ సుందరయ్య భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో కళ్యాణ్ మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను వల్ల జిల్లాలో వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న, మామిడి, ఆకుకూరలు, కూరగాయలు తదితర పంటలకు అత్యధిక అపార నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చనుమోలు సైదులు, కటారపు గోపాల్, సిపిఎం నాయకులు మండూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తుఫాను బాధితులకు పరిహారం అందించాలి

గంపలగూడెం: గడిచిన మూడు రోజులపాటు పడిన విస్తార వర్షాలకు జిల్లా వ్యాప్తంగా ప్రతి మిరప, మొక్కజొన్న, వరి, పంటలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు ఎన్టీఆర్ జిల్లా తెలుగురైతు విభాగ నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన గంపలగూడెం-లింగాల రహదారిలో ఉన్న పలు మిర్చి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోట పుల్లమ్మ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి : రైతు, కౌలు రైతు సంఘాలు

చందర్లపాడు: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతుల సంఘాల ఆధ్వర్యంలో తుపాను వల్ల నష్టపోయిన రైతు కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ఈ సంవత్సరం 50 వేల ఎకరాల్లో మిర్చి, 1 లక్ష 25 వేల ఎకరాలలో వరి, లక్ష ఎకరాలలో పత్తి సాగైందని. దీనిలో 70 శాతం వరకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల అధ్యక్షుడు గుమ్మళ్ళ ఏడుకొండలు, కార్యదర్శి సందిపోగు లింగయ్య, రైతు సంఘం నాయకులు కందుల బుచ్చయ్య,రాయిడి వెంకటేశ్వరరావు,హుస్సేన్, వై.లక్ష్మీనారాయణ, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

రైతు కష్టం పట్టించుకునే వాళ్లే లేరు.. మాజీ మంత్రి దేవినేని

మైలవరం : రైతు కష్టం గురించి పట్టించుకున్న వాళ్లే లేరని ఏ ఒక్క అధికారి పొలం దగ్గరకు ఇంతవరకు రాలేదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. జి.కొండూరు మండలంలోని మునగపాడు, సున్నంపాడు గ్రామాల్లో శుక్రవారం పర్యటించి వరి పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తడిసి మొలకెత్తిందని పంట వాసన వస్తుందని తుఫాను వల్ల రైతులకు ఎకరాకు సుమారు రూ.50వేల వరకు నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కంచికచర్ల : మీచౌంగ్ తుపాన్‌కు పంటనష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మెండితోక జగన్మోహన్‌రావు అన్నారు. కంచికచర్ల మండలం పరిటాలలో ఇటీవల కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి పూర్తిగా నష్టపోయిన వరి, మినుము, శనగ పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. నందిగామ ఏడిఏ శ్రీనివాస్, కంచికచర్ల వ్యవసాయాధికారి, విజయ్ కుమార్, రెవిన్యూ సిబ్బంది, బాధిత రైతులతో కలిసి నీట మునిగి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టం వివరాలు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, సొసైటీ అధ్యక్షుడు మాగంటి వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలి....కోట కళ్యాణ్

తుపాన్ ప్రభావంతో పంటలు నష్టపోయన రైతులకు పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంచికచర్ల మండలం గని ఆత్కూరు, కొత్తపేట, మోగులూరు, యస్.అమరవరం, పెండ్యాల, కీసర గ్రామాల పరిధిలో ఇటీవల కురిసిన వర్షానికి నీట మునిగి తుడుచుపెట్టుకుపోయిన పంటలను పరిశీలించారు. బాధిత రైతులతో కలిసి మినుము, శనగ, వరి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తక్షణమే వ్యవసాయ, రెవిన్యూ సిబ్బంది పంట నష్టం అంచనాలువేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హనీఫ్, రైతులు పాల్గొన్నారు.

రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలుచేయాలి

తిరువూరు : తుఫాను ప్రభావంతో తడిసిన ధాన్యం రైతులకు నష్టపరిహారం ఎకరానికి రూ.50 వేలు ఇచ్చి ఆదుకోవాలని, తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, రంగు మారిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల దగ్గర ప్రభుత్వం కేటాయించిన గిట్టుబాటు ధరకే కొనుగోలు చేయాలని, రైతులకు జాడు విత్తనాలు ప్రభు త్వం సబ్సిడీపై అందించాలని ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం, సిపిఎం అధ్వ ర్యంలో రైతులు తిరువూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం తహశీల్దా ర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు ఎం.హరికష్ణ, రైతుసంఘం నాయకులు ఎస్ .వెంకటేశ్వర్లు, ప్రకాష్ రావు, ఎస్ వి. భద్రం, రైతులు మరకాల కాటంరాజు, యంద్రాతి రాము, సత్యనారాయణ, తాళ్లూరు వెంకటేశ్వరావు, తాళ్లూరు శ్రీను, జెట్టి శ్రీనివాసరావు, నాయుడు వెంకటేశ్వరావు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు

నష్టపరిహారం చెల్లించాలి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలంలో తుఫానుకు కారణంగా నష్టపోయిన పంట పొలాలను ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఆయనను ఎకరాకు రూ.40వేల పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చేసిందనుకునే సమయానికి తుఫాను కారణంగా నష్టపోయామని తమ గోడును వెళ్ళబుచ్చారు. డిసిసి అధ్యక్షులు బోర్రా కిరణ్, కాంగ్రెస్ నాయకులు గొంది సురేష్ పంట నష్టం గురించి ఆయనకు వివరించారు.

విజ్ఞాన కేంద్రం సూచనలు

ప్రజాశక్తి - వత్సవాయి, జగ్గయ్యపేట : కృషి విజ్ఞాన కేంద్రం, గరికిపాడు, వ్యవసాయ శాఖ జగ్గయ్యపేట డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో పంటలను పరిశీలించారు. వరి పంట కోత దశకు వచ్చిన తరుణంలో అక్కడక్కడ పడిపోయి ఉన్నాయి. ఈ పడిపోయిన రకాలో బిపిటి 5204, ఎంటియు 1061 రకాలు ఉన్నాయి. నీరు నిలబడలేదు, రైతు సోదరులు పక్వానికి వచ్చిన పంటను త్వరగా కోయాలని సూచించారు. కోత సమయంలో పాయలు చేసేస్త త్వరగా ఆరుతుందన్నారు. అక్కడక్కడ మిరప పంట పాక్షికంగా నేలవాలిందని, పూత, పిందె దశో ఉందని తెలిపారు. ఈ పదును ఆరకముందే పాక్షికంగా పడిన మొక్కలను నిలబెట్టాలన్నారు. అధిక తేమ ఒత్తిడిని నివారించేందుకు ఎకరానికి 20 కేజీలు చొప్పున యూరియా పిచికారి చేసుకోవాలని దీని వల్ల మొక్క తొందరగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని చెపారు. వేరుకుళ్లు తెగులు ఆశించుకుండా ఉండాలంటే ఒక లీటర్ నీటికి మూడు గ్రాములు చొప్పున బ్లైటాక్స్ పిచికారి చేయాలన్నారు. మూడో దఫా ఇంకా పత్తి తీయాల్సిన ఉంటే ఎండనివ్వాలని, మొక్కజొన్నను కూడా నిలబెట్టి మట్టి ఎగదొయ్యాలని అప్పుడు మొక్క నిలబడుతుందని అన్నారు. డివిజన్లో అన్ని క్షేత్రాలల్లో రైతులకు సలహాలిచ్చారు.


పంటలు పరిశీలించి సూచనలిస్తున్న దృశ్యం

వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - గంపలగూడెం: నీట మునిగిన వరి పంట పొలాలను ఎన్టీఆర్ జిల్లా గరిక పాడు ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ మధు వాణి, రాజశేఖర్ శుక్రవారం పరిశీలిం చారు. వినగడప, కొత్త పల్లి, గంపలగూడెంలో దెబ్బతిన్న పంటలను చూసి పలు సూచనలు చేసినట్లు ఏవో బి.సాయి శ్రీ తెలిపారు.

చీటీలు వేసి మోసగించిన మహిళకు మూడేళ్ల జైలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : చీటీలు వేసి మోసం చేసిన మహిళకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. పోలీసుల కథనం ప్రకారం విజయవాడ టూ టౌన్ పాత రాజరాజేశ్వరి పేటకు చెందిన మహిళలు వారి ఇంటి సమీపంలో నివసించే షేక్ నసీమా(43) చిట్టీలు కట్టించుకుంటుంది. చిట్టీలు వేయమని అడగ్గా మొదట్లో కట్టినవారికి బాగానే ఇచ్చిందని, కొన్ని రోజులుగా డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకుంటుందని బాధితులు తెలిపారు. ఈ మేరకు 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు, ఎస్.ఐ.శ్యాం సుందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితురాలైన షేక్ నసీమాను 22 ఆగస్టు, 2014న అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. కోర్టులో విచారణ అనంతరం షేక్ నసీమాపై నేరం రుజువైనందున శుక్రవారం ఎనిమిదవ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జ్ డి.లక్ష్మి నిందితురాలికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించారు. జరిమానా నుండి రూ.98 వేలను బాధితులకు ఇచ్చేలా మిగిలిన రెండు వేలు రూపాయలను న్యాయస్థానానికి జరిమానా కట్టాల్సిందిగా తీర్పునిచ్చారు.

వికలాంగుల చట్టాలను సద్వినియోగించుకోవాలి



ఆర్థిక సాయం అందజేస్తున్న రామకృష్ణయ్య

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): వికలాంగులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారా సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య సూచించారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ సభ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా వికలాంగులు-చట్టాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. రామకృష్ణయ్య మాట్లాడుతూ చట్టరీత్యా అందుబాటులో ఉన్న న్యాయసేవాధికార సంస్థ సేవలను వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వికలాంగులకు ఎటువంటి న్యాయ సహాయం కావాలన్నా న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచితంగా న్యాయ సలహాలను అందిస్తామన్నారు. కోర్టు ద్వారా పరిష్కరించుకోవాల్సిన కేసులకు ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు. వికలాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.కామరాజు మాట్లాడుతూ వికలాంగులకు కావాల్సిన ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకుంటే అర్హులైన వారిని గుర్తించి అందించడం జరుగుతుందన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ అల్లాడ శ్రీనివాసరావు ప్రసంగిస్తూ వికలాంగులకు అందించే సదరం ధ్రువపత్రాల విషయంలో దళారులను నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ న్యాయవాది కుమారి అజ్మా తున్నీసా, మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కె.వేణుకుమార్, ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి ఎన్ఎస్ నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.హేమలత, ప్రముఖ న్యాయవాది సిహెచ్.ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

'మైత్రి' ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రమాదవశాత్తు కాలు కోల్పోయిన బొర్రా బాబూరావు అనే వ్యక్తికి రోబోటిక్ కత్రిమ కాలు కోసం రూ.25 వేలు వితరణ అందించడం జరిగింది. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షులు కె వేణుకుమార్, ఆర్‌పేట ఎస్ ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్, బదిలీలు, అప్ డేషన్ పి.ఎఫ్ అకౌంట్స్, డివైఈఓ పోస్టులు, అర్బన్ ఎంఈఓ పోస్టులు మున్సిపల్ ఉపాధ్యాయులు కేటాయించడం వంటి డిమాండ్లు పరిష్కారం చేయాలని కోరుతూ మచిలీపట్నం మండల విద్యా శాఖాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీలు, ప్రమోషన్లు తక్షణం నిర్వహించాలని, మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అన్ని పోస్టులు అప్గ్రేడ్ చేయాలని, మున్సిపల్ టీచర్లకు పిఎఫ్ సౌకర్యం వెంటనే కల్పించాలని, మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు కొత్త డిడిఓల ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించాలని, పాఠశాలల అన్నింటికీ బోధనేతర సిబ్బందిని నియమించాలని, భవనాల అద్దె, కరెంట్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యా శాఖాధికారి దుర్గాప్రసాద్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కెఎ ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె లెనిన్ బాబు, జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజా శ్రీధర్, టివి రఘుకాంత్, నాగేంద్రరావు పాల్గొన్నారు.

21 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-గన్నవరం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఈ నెల 21న తేదీన ఉదయం పది గంటలకు గన్నవరం స్రవంతి హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి షేక్ ఇమామ్ శుక్రవారం తెలిపారు. డిసెంబర్ 12వ తేదీన జరగాల్సిన ఈ సంబరాలు తుపాను, ఎస్ఎ-1 పరీక్షల నేపథ్యంలో రీ షెడ్యూల్ చేసినట్లు తెలియజేశారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల విద్యార్థులు ఈ సంబరాల్లో పాల్గొనాలని కోరారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: క్రీడలలో రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉందని, ప్రభుత్వ ప్రోత్సాహం వుంటుందని సాదు నరసింహ రెడ్డి అన్నారు. పటమటలోని చేన్నుపాటి రామ కోటయ్య ఇండోర్ స్టేడియంలోలేట్ సూరెడ్డి సత్యనారాయణ మెమోరియల్ ఆహ్వానపు పురుషుల వాలీ బాల్ టోర్నమెంట్ శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి క్రీడాకారులుగా రాణించిన వారికి అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. వాలీబాల్ ఆట పట్ల ఆసక్తి కలిగించాలనే ఉద్దేశంతో మహాత్మా కల్చరల్ ఫ్రెండ్స్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నారని అన్నారు. కృష్ణాజిల్లా వాలీ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు బ్రహ్మాజీరావు మాట్లాడుతూ ఈ నెల



10 వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. విశాఖపట్నం, ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి, ప్రకాశం, ఎంసిఎఫ్ విజయవాడ జట్లు తలపడనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మా కల్చరల్ అసోసియేషన్ ట్రెజరర్ బొప్పాన కౌసలెంద్ర రావు, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ జీ ఎస్ టి నగేష్, నేషనల్ ప్లేయర్ ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీ మురళి మోహన్ పాల్గొన్నారు. సాయంత్రం ప్రారంభమైన పోటీలలో విశాఖపట్నం జట్టు తొలి విజయం సాధించి శుభారంభం చేసింది.

కెఎఫ్‌సి నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఎంతో మందికి చక్కని రుచులను అందిస్తున్న కెఎఫ్‌సి రెస్టారెంట్ నూతన శాఖను నగరంలోని బెంజిసర్కిల్ ప్రారంభించినట్లు రెస్టారెంట్ ఇంఛార్జి ఎం.సుప్రీత్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో మొదటిసారిగా 1995లో రెస్టారెంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అప్పటి నుండి నేటి వరకు ఎంతో మందికి చక్కని వంటకాలను మంచి రుచులతో అందిస్తున్నామని అన్నారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు ఉన్న ఆహారాన్ని అందిస్తున్నామని అన్నారు. కెఎఫ్‌సి రెస్టారెంట్ మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా మార్పు చేస్తూ సేవలను అందిస్తుంది అన్నారు.

'కొడాలిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేస్తాం'

ప్రజాశక్తి-గుడివాడ: రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి గెలుపును ఎవరు ఆపలేరని, నానిని శాశ్వతంగా ఫామ్‌హౌస్‌కు పరిమితం చేస్తామని జనసేన నాయకులు సందు పవన్ అన్నారు. శుక్రవారం స్థానిక జనసేన కార్యాలయంలో జనసేన, టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ శాసనసభ్యుడు జ్యోత్యిష్యుడి రూపం ఎత్తాడని, ఓటమి భయంతో జోతిష్యుడి రూపంలో దర్శనమిస్తున్నాడని ఎద్దేవ చేశారు. వైసీపీ ప్రభుత్వం రైతుల పాలిట ఐరన్ లెగ్ ప్రభుత్వంగా మారిందన్నారు. గత ఐదేళ్లుగా తుఫానులు, అకాల వర్షాలతో రైతులు నష్టపోతుంటే కనీసం పరామర్శించని కొడాలి నాని, ఎన్నికల ముందు మాత్రం రైతులు వద్ద వెళ్లి ముసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు.

వరి పొలాల పరిశీలన

ప్రజాశక్తి-గుడివాడ: నియోజకవర్గంలో రైతులు నట్టేట మునిగి ఇబ్బందుల్లో ఉంటే ఏమి పట్టనట్టు వ్యవహరించే ఎమ్మెల్యే గుడివాడకు ఉండటం దౌర్భాగ్యమని టిడిపి ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆరోపించారు. శుక్రవారం నియోజకవర్గంలో వరి పొలాలను రాము పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ఎమ్మెల్యేలంతా రాచరికంలో ఉన్న రాజుల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. యూట్యూబ్ లైకులు, సోషల్ మీడియా షేర్ల కోసం కొడాలి నాని మాట్లేడే మాటలను పట్టించుకోవలసిన అవసరం లేదన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలలో తిరిగితే రైతులు ఎంత వేదనలో ఉన్నారో తెలుస్తుందన్నారు. నష్టపరిహారం ఎప్పుడు చెల్లిస్తారో, తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని ఎప్పుడు కొనుగోలు చేస్తారో, ధాన్యం కొనుగోలుకు లారీలు ఎప్పుడు వస్తాయో తెలపాలన్నారు.

చైర్మన్‌గా రామకృష్ణప్రసాద్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగరంలోని ఎండోమెంట్ భవనంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్‌గా వి.అనంత రామకృష్ణ ప్రసాద్ (అమ్మ ప్రసాద్) శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, పేరి కామేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగదేసి రవికుమార్, ఆంధ్రప్రదేశ్ వెల్ఫేర్ బోర్డు మెంబర్, పెద్దిపోగు కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ జి.నాగసాయి, బ్రాహ్మణ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఏ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

శ్రీధనుర్మాస మహోత్సవం

ప్రజాశక్తి-గుడివాడ : ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభం సందర్భంగా లారీ ఓనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పాత మున్సిపల్ ఆఫీసు వద్ద గల రామాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి రాటను పాతి ధనుర్మాస మహెూత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షులు గుత్తా చంటి, దిమ్మిటి రాంబాబులు, అడబాల అప్పారావు, లారీ ఓనర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడికి శుక్రవారం విశేష సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు పర్యవేక్షించారు. నిత్య ఆర్జిత సేవలైన శ్రీ అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్షకుంకుమార్చన, శ్రీ చక్రనవావరణార్చన, చండీ హోమం, శాంతి కళ్యాణం, ఇతర సేవల్లో యాత్రికులు పాల్గొన్నారు. యందు విశేషంగా పాల్గొని, శ్రీ అమ్మవారిని స్వామివారిని భక్తులు దర్శించుకన్నారు. కార్తీక మాసం సందర్భంగా ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయ అర్చక సిబ్బంది శాస్త్రోక్తంగా సహస్రలింగార్చన సేవ నిర్వహించారు. సాయంత్ర సమయంలో నటరాజ స్వామీ ఆలయం పక్కన 6.30 గంటలకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



వికలాంగుల్లో ఆత్మస్థైర్యం పెంచాలి

ప్రజాశక్తి-గన్నవరం: మండల పరిషత్ ఆవరణలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా జడ్పిటిసి సభ్యురాలు ఎలిజిబెత్ రాణి, జడ్పిటిసి కోఆప్షన్ సభ్యులు ఎండి గౌసాని, మండల అభివద్ధి అధికారి సత్య కుమార్, మండల విద్యాశాఖ అధికారి కే. రవికుమార్, జిల్లా పరిషత్ హై స్కూల్ గర్ల్స్ ప్రధానోపాధ్యాయుని ఝాన్సీ రాణి, జిల్లా పరిషత్ హైస్కూల్ (బాలుర) ప్రధానోపాధ్యాయిని యన్ రవీంద్ర భవాని, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (సిల్వర్ జూబ్లీ) ఉపాధ్యాయుని ఝాన్సీ, ప్రత్యేక ఉపాధ్యాయుని సుభాషిణి గారు,భవిత స్కూల్ ఉపాధ్యాయులు పీ శ్రీనివాసరావు ఎస్ రోజారాణి సి ఆర్ పి లు తదితరులు పాల్గొన్నారు. మండల విద్యాశాఖ అధికారి కే.రవికుమార్ సభాధ్యక్షత వహించి అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. మండల అభివద్ధి అధికారి సత్య కుమార్ మాట్లాడుతూ భవిత కేంద్రం ఈ పిల్లల శిక్షణకు మంచి వరమని ఇది ఒక దేవాలయం లాంటిదని అన్నారు. జడ్పిటిసి సభ్యురాలు ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ ప్రభుత్వం వీరికి కల్పించే సదుపాయాలను ఈ పిల్లల పేరెంట్స్ ఉపయోగించుకోవాలని చెప్పారు. జడ్పిటిసి కోఆప్టెడ్ సభ్యులు శ్రీ ఎండి గౌసాని మాట్లాడుతూ ఈ పిల్లలకు ఈ కేంద్రంలో మంచి శిక్షణ ఇస్తున్నారని పేర్కొన్నారు. బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని శ్రీమతి రవీంద్ర భవాని మాట్లాడుతూ స్వల్ప సమస్యలు ఉన్న ఈ బాలల్లో ప్రత్యేక నైపుణ్యాలు ఉంటాయని వాటిని వెలికి తీయాలన్నారు.



మాట్లాడుతున్న ఎండిఒ సత్యకుమార్

డ్వాక్రా మహిళలకు ఆటోలు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: డ్వాక్రా సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా ప్రవేశ పెట్టిన ఉన్నతి మహిళా ఆటో శక్తి పథకం ఎంతగానో ఉపయోగపడుతోందని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్నతి మహిళా శక్తి పథకం క్రింద అర్హులైన నలుగురు డ్వాక్రా మహిళలకు ఆటోలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఈ పథకం మహిళల జీవనోపాధికి ఎంతో దోహదపడుతుందన్నారు. లబ్ధిదారులపై ఎటువంటి భారం లేకుండా సులభ వాయిదాల్లో రుణాలు చెల్లించుకుంటు కుటుంబాలను పోషించుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 10 శాతం డబ్బులను ఎస్‌హెచ్‌జీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తే మిగిలిన 90 శాతం వడ్డీలేని రుణంగా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అందులో భాగంగా నిరంతరం ఆదాయం పొందేలా చేయూత నిచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా వడ్డీలేని రుణాలు అందిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.



తెలంగాణ మంత్రిని కలిసిన వైసిపి సీనియర్ నాయకులు



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా నుండి పది అసెంబ్లీ స్థానాలకు 9 అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే కాకుండా పాలేరు నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిచిన తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మండల వైసిపి సీనియర్ నాయకులు పాలంకి మోహన మురళి రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మేరీ మాత గుడిలో చోరీ

ప్రజాశక్తి - గంపలగూడెం : మండల పరిధిలో వినగడప ప్రధాన రహదారి వెంట ఉన్న మేరీమాత గుడిలో చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. యధావిధిగా శుక్రవారం ఉదయం పరిశీలించగా, తాళం పగలగొట్టి ఉందని హుండీలో 13 నుంచి రూ.15 వేల వరకు ఉండేవని తెలిపారు.

ఎల్‌బిఆర్ సిఇ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో హోం ఫస్ట్ ఫైనాన్స్ సంస్థ ఎంబీఏ విద్యార్థుల ప్లేస్మెంట్స్‌లో పదిమంది ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ అప్పా రావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఎంబిఎ విభాగా ధిపతి డాక్టర్ ఎ.ఆదిశేషారెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్స్ సుజిత్ కుమార్ రావత్, వేణుగోపాల్‌లను కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో యాజమాన్యం

అవకతవకలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - గంపలగూడెం: పేద కార్మికుల విషయంలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎన్టీఆర్ జిల్లా ఉపాధి హామీ పనుల ప్రాజెక్టు డైరెక్టర్ జె.సునీత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ వద్ద ఉపాధి హామీ పనులపై జరుగుతున్న ప్రజా వేదికలో ప్రిసైడింగ్ అధికారిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుండి జరిగిన పనుల వివరాలు, ఖర్చుచేసిన నగదుపై ఆరా తీశారు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సభాముఖంగా సునీత కోరారు.

దుర్గమ్మను దర్శించుకున్న సిఎం కార్యదర్శి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్ర కీలాద్రి దుర్గమ్మను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శి రేవు ముత్యాల రాజు దంపతులు శుక్రవారం అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేసిన ముత్యాల రాజు దంపతులకు ఆలయ కార్యనిర్వహణాధి కారి కె.ఎస్.రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మ వారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి ఆలయ వేద పండితులు వేదాశీర్వ చనం చేయగా ఆలయ కార్యనిర్వహణాధికారి వారు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



చిత్రపటం అందజేస్తున్న ఇఒ


ఎస్‌విఎస్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - మైలవరం : ద్వారకాతిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్‌వి.సుధాకర్‌రావు జన్మదినోత్సవ వేడుకలు శుక్రవారం మైలవరం లో ఘనంగా నిర్వహించారు. స్థానిక శాసన సభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎస్.వి. ఎస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఎస్‌ఐలకు సన్మానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ నూతన ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన డి.ఆనంద్, బదిలీ అయిన ఎస్ఐ బివి రామారావును శ్రుకవారం కృష్ణా జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘ సమైక్య సేవా కమిటీ చైర్మన్ కాకరపర్తి, సోమేశ్వర రావు ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బియ్యం, కిరాణ వర్తక సంఘం అధ్యక్షులు పేరూరి నరసింహారావు, వాసవి క్లబ్స్ ప్రతినిధులు కొత్త కృష్ణారావు, రాయపూడి శ్రీకాంత్, చిన్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




జగ్గయ్యపేట నూతన ఎస్‌ఐడి ఆనంద్ కలిసిన కృష్ణా జిల్లాఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు

కుటుంబీకులకు మైనర్ల అప్పగింత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఇబ్రహీంపట్నంలో మిస్సైన ఇద్దరు మైనర్లను పోలీసులు శుక్రవారం జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. వివరాల ప్రకారం... ఇబ్రహీంపట్నం పరిధిలో బాలిక (17)మిస్సింగ్‌పై తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ జానకిరామ్‌కు వచ్చిన సమాచారం మేరకు మైనర్లు దగ్గర ఉన్న సెల్ సిగ్నల్ ట్రేస్ చేయడంతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ సెల్ సిగ్నల్ ఆధారంగా ఎక్కడున్నారో తెలుసుకుని స్టీల్ ప్లాంట్ దగ్గర రాత్రి 8 గంటలకు సమయంలో ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. బాలుడు జగ్గయ్యపేటకు చెందినవానిగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టిన రోజే మిస్సింగ్ కేసును ఛేదించడంతో ఎస్ఐ ఆనంద్ కుమార్‌ను స్థానికులు ప్రశంసిస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంలో విఫలం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గంలో హరిజన, గిరిజన, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి తన శక్తి వంచన లేకుండా పని చేస్తానని కాంగ్రెస్ పార్టీ నందిగామ నియోజకవర్గ నాయకులు, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ జి.రత్న కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ముఖ్యంగా తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసినట్లు తెలిపారు. కంచల-వేదాద్రి ఎత్తి పోతల పథకం మరమ్మతులు చేయించి చివరి భూములకు సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందిగామ పట్టణంలో ప్రతిరోజూ మంచినీరు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రహదారులు బాగు చేయాలని డిమాండ్ చేశారు. రహదారులు అభివద్ధి చేయకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామన్నారు. విద్యాధికులు, సీనియర్ సిటిజన్స్ ఎల్ఎల్ఎం, ఎంటెక్, రెండు ఎంఎలు చదివిన తనకు జాతీయ కాంగ్రెస్ పార్టీ శాసనసభకు నందిగామ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.



జి. రత్న కుమార్

సంక్షేమాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సంక్షేమం, అభివృద్ధితో సిఎం జగనన్న పరిపాలన చేస్తున్నారని పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక పశ్చిమ నియోజకవర్గంలో 39,46,51 డివిజన్లలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి సచివాలయంలో అమర్చిన పేదలకు చేకురిన లబ్దిని వివరించే బోర్డును ఆవిష్కరించి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జండా దిమ్మను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక పెద్దలతో ముఖ ముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న హయాంలో కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నరేంద్ర, గుడివాడ నరేంద్ర రాఘవ, మరుపిళ్ళ రాజేష్, యశోధర్, గౌస్ మొహిద్దీన్, మనోజ్ కొఠారి పార్టీ నాయకులు పాల్గొన్నారు. **కంచికచర్ల :** అంబేద్కర్ కాలనీలో గల సచివాలయం 3 పరిధిలో కార్యక్రమం నిర్వహించారు. పట్టణ వైసిపి అధ్యక్షుడు, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు అధ్యక్షత వహించారు. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు మాట్లాడారు. ఎన్నో సంక్షేమ పథకాలిస్తున్న జగన్‌ను రానున్న ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రి ని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు వేల్పుల సునీత, జంగా సంతోష్ రావు, నాయకులు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ మాడుగుల శంకర్, కార్యదర్శి మీర్జావలి తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని 12 వ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడారు. నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ళ పాలన గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సాగించిన పరిపాలనకు వ్యత్యాసాన్ని ప్రజలందరూ గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర రావు, కౌన్సిలర్ పాకలపాటి సుందరమ్మ, వైఎస్సార్సీపీ నాయకులు గహ సారథులు పాల్గొన్నారు. షేర్ మహమ్మద్ పేటలో యువ నాయకులు సామినేని వెంకట కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పరీక్ష పేపర్లు యూట్యూబ్‌లో ప్రత్యక్షం

ప్రజాశక్తి - మైలవరం : ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో 6 నుండి 10వ తరగతి వరకు ప్రభుత్వం నిర్వహించే ఎస్ఎ-1 పరీక్ష పేపర్లను కొంతమంది యూట్యూబర్లు ముందుగానే ప్రకటించటం నిత్యకత్యమైంది. గతంలో క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, యూనిట్, యాన్యువల్ పరీక్షలను ప్రభుత్వం నిర్వహించగా వీటి స్థానంలో ఎస్ఎ-1) ఎస్ఎ-2, ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-2 పరీక్షలను నిర్వహిస్తున్నారు. వీటికి సంబంధించిన ప్రశ్న పత్ర పేపర్లను ముందుగానే కొంతమంది యూట్యూబర్లు ప్రకటించడంతో విద్యార్థుల ప్రతిభకు ఆటంకంగా నిలిచాయి. యూట్యూబర్లు ముందుగానే పేపర్లను ప్రకటించడంపై జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుకను వివరణ కోరగా ఈ విషయం తమ దష్టికి రాలేదని, వారిపై చర్యలు తీసుకుంటాంమన్నారు.

విద్యుత్ శాఖ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ జెడి కమలాకుమారి ఆధ్వర్యంలో 41 బందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా 2639 సర్వీసులను పరిశీలించగా 270 సర్వీసుల అధికలోడుపై రూ.7,40 లక్షలు అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా విజయవాడ రూరల్ జెడి జిబి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్ చౌర్యానికి పాల్పడితే ఎంతటి వారైనా శిక్షార్హులవుతారన్నారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ ఎడిఇ నవీన్‌కుమార్ రూరల్ ఎఇడిలు ఉన్నారు.



గృహప్రవేశం కార్యక్రమంలో సామినేని ఉదయభాను

సొంతింటి కల సాకారానికి కృషి

ప్రజాశక్తి - వత్సవాయి : పేదల సొంతింటి కల సాకారం చేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాలలో పేదలందరికీ ఇల్లు కార్యక్రమాన్ని చేపట్టి ఇల్లు లేని ప్రతి ఒక్కరికి సొంతింటి కలను సాకారం చేస్తున్నారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. వత్సవాయి గ్రామం, జగనన్న కాలనీ నందు ఎంపీటీసీ మిట్టకొలు నరేష్ అనురాధ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి నిరుపేదలకు స్థలం, ఇల్లు ఏర్పాటు చేయడమే ధ్యేయంగా జగనన్న సంక్షేమ పాలన సాగిస్తున్నారని అన్నారు.

విరాళం

పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి విజయవాడ రూరల్ గొల్లపూడి గ్రామానికి చెందిన తునికిపాటి రామారావు జ్ఞాపకార్థం తునికిపాటు రామ్మోహన్ శుక్రవారం ఆలయ అధికారులకు రూ.25,116/ల విరాళాన్ని అందజేశారు.

మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - సింగ్‌నగర్ : తుపాను వల్ల దెబ్బతిన్న మ్యాన్‌హోల్‌సను శుక్రవారం సంబంధిత సిబ్బంది శుభ్రం చేశారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పాయకాపురం సుందరయ్య నగర్‌లోని ఉన్నత పాఠశాల దగ్గర డ్రైనేజీ పరిశీలించి మరమ్మతులు చేశారు.

మినీ వాటర్ ఫౌంటైన్‌కు శంకుస్థాపన

జగ్గయ్యపేట : పట్టణంలో స్థానిక ప్రభుత్వ హాస్పటల్‌లో ప్రధాన ద్వారం వద్ద 12 లక్షల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేయనున్న వాటర్ ఫౌంటెన్ నిర్మాణ పనులకు శుక్రవారం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ బాబు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.12 లక్షలతో అందంగా నిర్మించబోయే ఈ ఫౌంటెంట్ నిర్మాణం త్వరితగతన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ నిల్వలు స్వాధీనం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి నేతాజీ నగర్‌లో పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. ఒక ఇంట్లో పిడిఎఫ్ బియ్యం అక్రమ నిల్వ ఉందన్న సమాచారంతో ఇబ్రహీంపట్నం ఆర్ఐ రెవెన్యూ అధికారులతో కలిసి దాడి చేసి బియ్యం మూటలను పట్టుకున్నారు. సుమారు 300 కేజీలు బియ్యాన్ని వారు స్వాధీనం చేసుకున్నారు.

పత్తి కొనుగోలు పున : ప్రారంభం

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి కొనుగోలు శుక్రవారం నుండి పున:ప్రారంభమైనట్లు ఎఎంసి సెక్రెటరీ తెలిపారు. మిచౌంగ్ తుపాన్ నేపథ్యంలో మూడు రోజులు పత్తి కొనుగోళ్లు జరగలేదని, తుఫాన్ అనంతరం పత్తి కొనుగోలు ప్రారంభించామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురం పున్నమి హోటల్ బరం పార్కు వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై భవానీపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సుమారు 25-30 సంవత్సరాల వయస్సు గల ఒక పురుషుడు బరం పార్కు ఎదురు గల ఫ్లైఓవర్ కింద వున్న పార్కు గ్రిల్స్ పక్కన కూర్చుని మృతిచెందాడు. పక్కనే బడ్డీకొట్టు నిర్వాహకుడు గంగరెడ్డి భవానీపురం పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతిచెందిన బాధితుడి గురించి చుట్టుపక్కల వారిన విచారించారు. మృతుడు ఎర్రగా వుండి, బ్లూషర్టు, లోపల గ్రీన్ రంగు బనియర్ (టీ షర్టు, వంకాయ రంగు ఫ్యాంటు ధరించి వున్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు భవానీపురం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సిఐ తెలిపారు.





ఆపన్నహస్తం కోసం

రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి-గన్నవరం : మిచౌంగ్ తుఫాన్ తో రైతులు నిండా మునిగిపోయినా పాలకులు, అధికారులు మాటలకు పరిమితం కావడం తప్పా.. ఆపన్న హస్తం అందించే వారేరీ అని రైతాంగం ఆశగా ఎదురు చూస్తోంది. తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు వ్యవసాయ పంటలు దెబ్బతిని సన్న, చిన్నకారు, కౌలు రైతులు కోలుకోలేని స్థితి నెలకొందని మనోవేదనకు గురవుతున్నారు. గన్నవరం మండలంలో ఈఏడాది ఖరీఫ్ లో 25,450 ఎకరాల్లో వరి వంగడాలు 1061 (30 శాతం), 1318 (70 శాతం) సాగు చేశారు. పంటల సాగులో సాగునీటి కష్టాలను చవిచూసిన రైతులపై గోరుచుట్టుపై రోకలి పోటు మాదిరి మిచౌంగ్ తుఫాన్ మరింత కుంగదీసిందని విచారం వ్యక్తం చేస్తున్నారు.మండలంలో 75 శాతం మంది కౌలురైతులు వ్యవసాయ సాగులో ఉన్నారు. వారంతా బడుగు, బలహీ, అట్టడుగు వర్గాల వారే ఎక్కువ. గతంలో వ్యవసాయ కార్మికులుగా ఉన్న వారంతా కౌలు రైతులుగా రూపాంతరం చెందిన, కుటుంబం యావత్తు ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తూ జీవన కొనసాగిస్తున్నారు. వ్యవసాయ పనులు తప్పా వేరే పని తెలియని వీరు ప్రకతి ప్రకోపానికి గురై కష్టాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఖరీఫ్ సాగు చేసిన వరి పైరు అన్ని విధాల దెబ్బతింది. తుఫాన్ సమయానికే మండలంలోని పలు గ్రామాల్లో కొంత వ్యవసాయ కూలీలతో, కొంత యంత్రాలతో కోసి పనలపై, ధాన్యం రాశు లుగా ఉంది. ఆరు వేల ఎకరాలకై పైగా కోతలు కోశారు. భారీ వర్షాలతో కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు నేలకొరిగిందని, కోత కోసింది పనలపై ఉందని, యంత్రాలతో కోసింది ధాన్యం రాశు లుగా ఉందని ఇదంతా ఇప్పుడు నీట మునిగి రైతన్నను నట్టేట ముంచినట్టయ్యిందని తీవ్ర మనోవేదన చెందుతున్నారు. పాలకులు, అధికారులు నష్టపోయిన రైతులను అంచనాలు రూపొందించి, ఆదుకోవడంలో అలసత్వాన్ని ప్రదర్శించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతుంది. వర్షం తగ్గాక నీట మునిగిన పంటలను కాపాడుకోవడానికి పెద్ద సవాళ్ళే ఎదుర్కొవాల్సి వస్తుందని, పంటపొలంలో నీరు బయటకు పంపాలంటే ఇప్పటికే పంట కాలువలు, డ్రైయిన్లు, మురుగు కాలవలు, బోదెలు వర్షపు నీటితో నిండుకుండాలా ప్రవహిస్తున్నాయి. దీంతో 1318 రకం వరి వంగడం తొందరగా మొలకెత్తుతుందని వరి పైరు నేలకొరిగినా, పనలపై ఉన్నా, ధాన్యం రాశులుగా ఉన్నా నీటిలో నాని మొలకెత్తి పంట దెబ్బతిని నష్టపోవాల్సిన దుస్థితి నెలకొందని రైతాంగం వాపోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తక్షణం రైతులను ఆదుకోనేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరుకుంటున్నారు.



తొలగని నీటి ముంపు

- చెరువుల్లా పొలాలు
- రైతుల దిగాలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో నీరు నిలిచి వరిసాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం తెరపిచ్చి మూడు రోజులు గడిచి నా పొలాల్లో నీరు పోకపోవడంతో పనలపై ఉన్న పొలాలతో పాటు కోతకోయని పంట నేలవాలి నీళ్లలో నానుతున్నాయి. మండలపరిధిలో కడవకొల్లు, వీరవల్లి, గండిగు 0ట, ఉయ్యూరు, సాయిపురం పరిధిలో పొలాల్లో మోకాలులోతు నీళ్లు నిలిచి వరి కుళ్లి పోతుంది. పొలాల్లో నీళ్లు బయటకు పోకపోవడంతో రైతులు నానా తంటాలు పడుతు న్నారు. పొట్లపాడు, కడవకొల్లు, వీరవల్లి పరిధిలో ఎగువనుండి వస్తున్న ముంపు నీరు నిలిచి చెరువలను తలపిస్తున్నాయి. కుప్పలు వేసిన పొలాల్లో నీరునిలిచి కుప్పలు నాని పోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: మైనారిటీ వర్గాల అభ్యున్నతి పాటు పడిన డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగుతూ సమసమాజస్థాపనకు కషి చేయాలని దళితరత్న డాక్టర్ సీఎం మంగరాజు అన్నారు. బాపులపాడు మండలం రంగన్న గూడెంలో జిల్లా అధ్యక్షుడు వీరభద్ర అమలదాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని దాత మేరీప్రసన్నతో కలిసి ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగినసభలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సమన్యాయం జరిగేలా మన దేశ రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు అంబేద్కర్ అని, ఆయన స్ఫూర్తితో యువత సము న్నత లక్ష్యాలు సాధించేలా ముందడుగు వేయాలన్నారు. పాలేటి ఉమామహేశ్వరరావు, మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు పోలిమెట్ల దేవిద్రజు, ఉపాధ్యక్షుడు ఏసుపాదం పాల్గొన్నారు.

నాగరాజు మృతికి సంతాపం

ప్రజాశక్తి-ఉంగుటూరు : సిపిఐ నాయకులు ఎర్రగుంట నాగ`రాజు (60) శుక్రవారం తేలప్రోలు గ్రామంలో తన స్వగహమునందు అనారోగ్యంతో మృతిచెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి అక్కినేని వనజ, మాజీ శాసనమండలి సభ్యులు జల్లి విల్సన్, నాయకులు ముక్కామల ఉమామహేశ్వరరావు, సిపిఎం మండల పార్టీ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, బీమవరపు సుబ్బారెడ్డి తదతరులు నాగరాజు భౌతిక కాయానికి పూల మాల వేసి నివాళులర్పించారు

రైతులను ఆదుకోవాలని వినతులు, ధర్నాలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: తుఫాన్ వలన కురిసిన భారీ వర్షాల వలన నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే స్పందించి ప్రభుత్వం రైతులని ఆదుకోవాలని బాపులపాడు మండలం సిపిఎం అధ్యక్షుడు బేతా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.శుక్రవారం ఆరు గొలను, తిప్పనగుంట, రంగయ్యప్పారావుపేట, కానుమోలు, తదితర గ్రామాల్లో గల వరి పంటను రైతు సంఘంతో కలిసి ఆయన పరిశీలించారు. రైతులను పరామర్శించి పంట నష్టం వివరాలను అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని కోసిన వరి చేను మునిగిపోవడంతో ఆపరాలు దెబ్బతిని మరలా విత్తనాలు కొనుగోలు చేసే స్థితిలో మేము లేవని రైతులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా బేతా శ్రీనివాసరావు మాట్లాడుతూ తీవ్రంగా నష్టపోయిన రైతులను వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఒక్కొక్క ఎకరానికి 30వేల రూపాయలు నష్టపరిహారం చెల్లిం చాలని డిమాండ్ చేసారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి భవానికి వినతి పత్రం అందజేశారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-గూడూరు : తూఫాన్ వల్ల కురిసిన వర్షాలకు రైతులతో పాటు కౌలురైతులు తీవ్రంగా నష్టపోయారని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం గూడూరు తహశీల్దారు కార్యాలయం వద్ద ఏ పి కౌలు రైతు సంఘం ఆధ్వంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ పంటలకు పెట్టుబడి పెట్టి, కౌలుచెల్లించి, చేతికివచ్చిన పంట నీళ్లపాలయ్యిందన్నారు. కౌలు రైతులకు ఎక్కువమందికి భూయజమాని సంతకం పెట్టకపోవడం వలన సి సీ ఆర్ సి లు రాలేదని.ఈ సమయంలో ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అన్నారు.నిష్పక్ష పాతంగా ఎన్యూమరేషన్ చేసి, నష్టపోయిన రైతులను పేర్లు నమోదుచేయాలని,కౌలు కార్డ్ లేకపోయినా విచారణ చేసి కౌలురైతుల పేర్లు నమోదు చేయాలని,కౌలు రైతులకు ఎకరానికి 30 వేలు, రైతులకు 20వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. తడిసిన, రంగుమారిన, మొలకవచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతుధరకు కొనాగోలు చేయాలని, అపరాలు మినుములు, పెసలు, మొక్కజొన్న విత్తనాలు ఉచితంగా ఇవ్వాలన్నారు.కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సీలం నారాయణరావు, జిల్లా కమిటీ సభ్యులు దాసరి ఉమాసాయి సాయిరాం, సిఐటియు నాయకులు కె వేణుగోపాలరావు, ఎస్.కె భాషా,కౌలు రైతులు చందు వెంకటేశ్వరరావు, బత్తిన జ్వాలా, చిగురి శెట్టి సాయి,నల్ల పోతు శ్రీనివాసరావు, చింతా శివ, రావి వెంకటేశ్వరావు, సాలా కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యం

ప్రజాశక్తి -మొవ్వ : మిచౌంగ్ తుఫాన్ బాధిత రైతాంగాన్ని ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని మొవ్వ మండలం కాజ గ్రామానికి చెందిన పలువురు కౌలు రైతులు కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్బికే అధికారులకు వినతిపత్రం అందించారు. కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు నేతత్వంలో స్థానిక కౌలు రైతులు వివిధ డిమాండ్లను అధికారుల దష్టికి తెచ్చారు.వాస్తవ సాగుదార్లను నమోదు చేయాలని, కౌలు కార్డులు లేని కౌలు రైతులను నమోదు చేయడంతో పాటు కౌలు రైతులకు ఎకరాకు రూ ముప్పై వేలు, రైతులకు రూ ఇరువై వేలు పరిహారం అందించాలని, రబీ సాగుకు అవసరమైన విత్తనాలను రైతులకు ఉచితంగా అందించాలని వినతిపత్రం లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, కొడాలి శ్రీను, చిట్టిబొమ్మ నాగేశ్వరరావు, ఆర్ అగ్గి రాముడు , శ్రీను, మధుసూదనరావు, ఆర్ పట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని అధికారులకు వినతి

ప్రజాశక్తి-పెదపారుపూడి : తుఫాన్ ప్రభావంగా వరి పొలం నీటిపాలైన రైతుల్ని ఆదుకోవాలని రైతుసాంగం నాయకులు అన్నే సుబ్బారావు అన్నారు.రైతులను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం పెద పారుపూడి మండల వ్యవసాయ అధికారి త్రినాథ్ ఆంజనేయకి అర్జీ సమర్పించిన రైతులు కౌలు రైతులు ఈ సందర్భంగా అనన్నేసుబ్బారావు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంట ప్రకతి కోపంతో తుఫానుతో వరి పైరు నీట మునిగిందని దీంతో రైతాంగం తీవ్ర నష్టానికి గురవుతున్నారని అన్నారు కావున అధికారులు స్పందించి వెంటనే రైతులకి నష్టపరిహారం కింద నమోదు చేపించాలని కోరారు ఈ కార్యక్రమంలో కౌలు రైతులు పి ఈశ్వరమ్మ పి కొండలు అనిగాని రాజేష్ ఏ వెంకయ్య వీరంకి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-పెడన : తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతు కు ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పెడన మండలంలోని తోటమూల లో నీట మునిగిన వరి పొలాలను సిపిఎం నాయకులు వాసా గంగాధరరావు కలసి సందర్శించారు. ఈ సందర్భంగా గౌరీశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ పంట అంతా నీటిపాలై రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఎకరానికి 30 వేల నుండి 40 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి తీరా పంట చేతికి వచ్చే సమయానికి తుఫాన్ రూపంలో నిరాశ మిగిల్చింది ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు ఎకరానికి 40 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా సిపిఎం, రైతు సంఘం గా డిమాండ్ చేసారు. మురుగు కాలువలు సరైన సమయానికి పూడికలు తీయకపోవడం వలన కాలువలు పారుదల లేక మరింత నష్టం ఏర్పడింది అని అన్నారు. అలాగే మినుము పంట వేసిన రైతులు మినుము పంట కూడా నీతిలోతిలో తడవడంతో ఆందోళన చెందుతున్నారు అన్నారు. మినుము వంట నష్టపోయిన రైతులకు కూడా ప్రభుత్వం విత్తనాలు సరఫరా ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గరికముక్కు రామయ్య, ఉసా రమేష్, వరద దుర్గారావు ,వరదు రామారావు, మరియు రైతులు పాల్గొన్నారు.



పెదపారుపూడిలో...



గూడూరులో...



మొవ్వలో...



బాపులపాడులో...



పెడనలో...

ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్‌కు 'విశిష్ట కళా బంధువు' పురస్కారం

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారులు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ సంస్థ బాధ్యులు సునీల్ కుమార్ అనుమకొండ, గిరిధర్ అరసవల్లి, గొరుపర్తి (స్ఫూర్తి) శ్రీనివాస్, ఎస్.పి.మల్లికార్జునరావులను విశిష్ట కళా బంధువు జాతీయ గౌరవ పురస్కారంతో సత్కరించబోతున్నట్లు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పాలోజు రాజ్ కుమార్, జాతీయ కన్వీనర్లు డాక్టర్ రంగిశెట్టి రమేష్, డాక్టర్ వలబోజు మోహనరావు తెలిపారు. గత కొంత కాలంగా చిత్రకళాభివద్ధికి రాష్ట్రం నలుమూలల పర్యటిస్తూ కళనీ, కళా సంస్కృతినీ పెంపొందిస్తూ భావితరాలకు తరగని చిత్రకళా సంపదను అందిస్తున్న వీరికి తెలుగు వెలుగు సాహితీ వేదిక (జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ) జాతీయ పురస్కారాల మహోత్సవంలో భాగంగా ఈనెల 10న విజయవాడ బాలోత్సవ్ భవన్లో వారిని సత్కరించనున్నట్లు తెలిపారు. కళా సేవతో జాతీయ పురస్కారాలకు ఎంపికైన వీరిని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఇన్చార్జి బి.ఆర్.తులసీరావు, కార్యదర్శి పిన్నమనేని మురళీ కష్ణ, అమరావతి బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు, జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు అభినందించారు.

12 అండర్-19 జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడ నగరం మరో ప్రతిష్టాత్మక క్రీడోత్సవాలకు వేదిక కానుందని, ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు అండర్-19 జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంటు-2023 జరగనుందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి టోర్నీ విజయవంతానికి కషిచేయాలన్నారు. 67వ ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-19 (బాలురు, బాలికలు) బ్యాడ్మింటన్ జాతీయ టోర్నమెంటుకు విజయవాడ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధ్యక్షతన శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జాతీయ టోర్నమెంటుకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు సీబీఎస్ఈ, కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయ, ఐసీఎస్ఈ పాఠశాలల నుంచి దాదాపు 500 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. అదే విధంగా 200 మంది వరకు కోచ్ మేనేజర్లు, 50 మంది టెక్నికల్ ఆఫీసర్లు తదితరులు రానున్నట్లు తెలిపారు. సమావేశంలో టోర్నీ కన్వీనర్ సి.శివ సత్యనారాయణరెడ్డి, పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ వెంకటేశ్వర్లు, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.రవికాంత, జేఎల్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) కేవీ నారాయణ పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లి : ధన్వంతరీ జయంతి సందర్భంగా శనివారం ఉదయం 9 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కీర్తి ఎస్టేట్స్‌లోని శ్రీ సురక్ష ఆయుర్వేద, యోగా అకాడమీలో మోకాళ్ల నొప్పులు, అరుగుదల రోగులకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ సురక్షా అకాడమీ చైర్మన్ డాక్టర్ కొండా మాణిక్యేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ సురక్ష పంచకర్మ సీనియర్ వైద్యులు, నాడీ వైద్య నిపుణులు కొండా పూర్ణ రాజేశ్వరి రోగులకు ఉచిత కన్సల్టేషన్, వ్యాధి నిర్ధారణ చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్యంగా జీవించాలని ఆయన కోరారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు సెస్ అందేలా చూడాలి

అధికారులకు కలెక్టర్ డిల్లీరావు ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : భవన నిర్మాణాలు చేపట్టే యజమానుల నుంచి చట్టపరమైన మార్గదర్శకాలకు అనుగుణంగా ఒక శాతం సెస్ వసూళ్లు సరైన విధంగా జరిగేలా.. ఆ మొత్తం ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు సకాలంలో చేరేలా చూడాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు జిల్లాస్థాయి ప్లాన్ అప్రూవల్, పని అమలు అధికారులను ఆదేశించారు. శుక్రవారం భవన, ఇతర నిర్మాణాల యజమానుల నుంచి ఒక శాతం సెస్ వసూలు విధానం అమలుపై కలెక్టర్ డిల్లీరావు.. కార్మిక, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కషిచేస్తోందని.. నిర్మాణాలు చేపట్టే అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, కాంట్రాక్టర్ల ద్వారా నిర్మాణ పనులు కోసం కాంట్రాక్టర్లు, ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీలకు చెల్లించాల్సిన బిల్లుల నుంచి ఒక శాతం సెస్‌ను మినహాయించి ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ విధానం సక్రమ అమలుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసమావేశంలో లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కార్మిక కమిషనర్ సీహెచ్ ఆశారాణి, అసిస్టెంట్ కమిషనర్ పి.విష్ణు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమరావతి బాలోత్సవం వాయిదా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈనెల 12, 13, 14 తేదీల్లో జరగాల్సిన అమరావతి బాలోత్సవం 6వ పిల్లల పండుగ తుపాను, పరీక్షల కారణంగా వాయిదా చేశారు. ఈ బాలోత్సవాన్ని ఈనెల 19, 20, 21 తేదీల్లో మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన రుద్రరాజు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్టీఆర్ జిల్లాలో తుఫానుతో దెబ్బ తిన్న పంట పొలాలను శుక్రవారం ఎపి పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పరిశీలించారు. జూపూడి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లోని పంట పొలాలను ఆయన పరిశీలించి తీవ్రంగా నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్రా కిరణ్, జనరల్ సెక్రెటరీ ఏసుదాసు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని ప్రతి సర్కిల్లో రోడ్డు ప్రమాదాలకు గురయ్యే ప్రదేశాల (బ్లాక్ స్పాట్స్)ను గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకు పలు చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులు నిర్ణయించారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్ష సమావేశం జరిగింది. వేగం నియంత్రణకు స్కూళ్లు, హాస్పిటళ్లు, పవిత్ర స్థలాలు ఉన్నచోట వాటిని సూచించే సైన్ బోర్డులు, అవసరమైన ప్రతి చోట స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈసమావేశంలో ఏపీఎస్ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ ఎ.వెంకటేశ్వర రావు, ఎపి పిటిడి డిప్యూటీ సిటిఎం బషీర్ ఆహ్మేద్, ఆర్ అండ్ బి-డిఈఈ వై శశి భూషణ్, నేషనల్ హైవే ఇంజనీర్ యం.వి.నాగేశ్వరావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ అబ్దుల్ సలాం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్- చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకర్, రావు, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కే.వీ.సత్యవతి, చీఫ్ సిటీ ప్లానర్ జీ.వి.జీ.ఎస్.వి ప్రసాద్, డిసిపి జుబిన్ సైరన్ రాయ్, డిసిపి-1 భాస్కర్ బాబు, ఎసిపి పి.మోహన్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కే.నారాయణ మూర్తి, వి.శ్రీనివాస, సుపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్- వి నరసింహమూర్తి పాల్గొన్నారు.

15న తెలుగు గళా పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర అధికార భాషా సంఘం, ఎన్‌టీఆర్ జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు ప్రసార మాధ్యమాల్లో వ్యాఖ్యాతలుగా, ప్రయోక్తలుగా, న్యూస్‌రీడర్లుగా పనిచేస్తున్న ప్రతిభావంతులకు తెలుగు గళా ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు తెలిపారు. ఈ నెల 15న తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన...కలెక్టర్ డిల్లీరావుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఆకాశవాణి, దూరదర్శన్‌తోపాటు వివిధ ప్రైవేటు ఛానళ్లలో పనిచేస్తున్న వారిని పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

జనవరి 20న అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవం: శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - విజయవాడ : స్వరాజ్య మైదానంలో ఏర్పాటుచేస్తున్న బీఆర్ అంబేద్కర్ విగ్రహం, స్మతివనాలను జనవరి 20న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (మునిసిపల్, పట్టణాభివద్ధి) వై.శ్రీలక్ష్మి వెల్లడించారు. ఈ పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. పనుల సత్వర పూర్తికి అధికారులు, కేసీపీ ప్రతినిధులకు మార్గనిర్దేశనం చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. స్పెషల్ సీఎస్ వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, కేసీపీ ప్రతినిధులు ఉన్నారు.

దస్తావేజులు పోయినవి

విజయవాడ భవానిపురం ఊర్మిళనగర్‌లో నివాసం ఉండే పిడుగు నాగరాజు S/o నరసింహారావు. జి కొండూరు మండలం, వెల్లటూరు గ్రామంలో ఆర్.యస్ నెంబర్ 150/2 లో చ.గ 387.2 లు ఖాళీ నివేశన స్థలం నా స్వాధీనంలో ఉంది. సదరు ఒరిజినల్ దస్తావేజులను జిరాక్స్ నిమిత్తం వెల్లటూరు నుండి జి కొండూరు బైక్ పై వెళుతుండగా మార్గమధ్యంలో పోయినవి.ఎవరికైనా దొరికిన యెడల 9347582542 నెంబర్ ను సంప్రదించగలరు.

ఇట్లు

పిడుగు నాగరాజు S/o నరసింహారావు,
76-17-763 పార్క్ స్ట్రీట్, ఊర్మిళ నగర్,
భవానిపురం ఎన్టీఆర్ జిల్లా.

మహారాజశ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 82/2023

బిట్వీన్
సాయిరి కృష్ణ ... వాది
మరియు
సామంతపూడి సత్యనారాయణ సూరి రిటైర్డు ఎస్‌బిఐ ఉద్యోగి, సన్నాఫ్ నంబులయ్య ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, పాత తిరువూరు, తిరువూరు పి.జెసి.జెసి తిరువూరు .... ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాదికి ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపినను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున పైనెంబరు దావాలో మీ హాజరు నిమిత్తం ది.27-12-2023వ తేదీన వాయిదా వేసియున్నారు. కాబట్టి మీరు వాయిదా రోజున ఉదయం 10.30 గం॥ స్వయంగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియపరచవలెను. లేని యెడల మీ పరోక్షముగా విచారణ జరిపి తీర్మానించబడునని మీకు యిందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్యుల ప్రకారం)

తిరువూరు
08-12-23

యన్. రమేష్ బాబు, బికాం, బి.యల్
న్యాయవాది, తిరువూరు.
సెల్: 9440481796

In The Court of The VIIIth Addl Dist Judge At Vijayawada
OS 436/2015

Between:
P.Dhana Lakshmi & Others ...Plaintiff
And
K.Satyanaryana S/o Kotha Bheemaiah, D/o 9-74-4, Tammina Vari Street, Kothapeta, Vijayawada ...Defendant No.3

ఈ నెంబరు దావాలో సదరు 3వ ప్రతివాదికి కోర్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించిన అందుకొనక పోవుటచే పై కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డర్ పాస్ చేసి యున్నారు. సదరు 3వ ప్రతివాది ది.22-12-2023వ తేదిన ఉదయం 10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు వున్న తెలుపుకొనవలెను. లేని యెడల వారి పరోక్షంన దావా తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

వాయిదా:22-12-2023

డా॥డి.వి.రమణారెడ్డి,
పి.శ్రీనివాసరావు,

మహారాజశ్రీ నందిగామ 16వ అదనపు కృష్ణా జిల్లా జడ్జి వారి కోర్టు లో
Gwop No 91/2023

Between:
మందమంచి కళ్యాణ్ చక్రవర్తి ...పిటిషనర్
మరియు
మందమంచి రాధిక ... రెస్పాండెంట్
R:- మందమంచి రాధిక, భర్త కళ్యాణ్ చక్రవర్తి, హిందు, వయస్సు 36సం॥లు, ప్రైవేటు ఉద్యోగి, అనుమంచిపల్లి పోస్ట్, జగ్గయ్యపేట మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పైన తెలిపిన Gwop No 91/2023 లో మీరు రెస్పాండెంట్ గా ఉన్నారు. పై కోర్టు నుండి Gwop సమన్లు అమలు జరుపుటకు శ్రీ కోర్టు వారు ది.18-12-2023 వ తేదీ ఉదయం గం.10.30 ని.లకు మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని సదరు కోర్టు వారి ఎదుట హాజరు కాగలరు. లేని యెడల సదరు Gwop 91/2023 లో మీకు పరోక్షముగా తీర్పు ఇవ్వడం జరుగుతుంది. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం దినపత్రిక నందు పబ్లికేషన్ ద్వారా మీకు తెలియజేయటమైనది.

వాయిదా తేది :18-12-2023

ఇట్లు

యడ్లపల్లి శ్రీనివాసరావు, గుర్రాల వెంకటరత్నం,
న్యాయవాదులు, నందిగామ, ఎన్టీఆర్ జిల్లా.

జగ్గయ్యపేట పురపాలక సంఘం - ఎన్టీఆర్ జిల్లా.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ROC No. 25781/DYSO-2/DESO/HIW/GGMP/2022&General Fund / 2023 / Dt. 08-12-2023

జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో 2 పనులు జిజిఎంపి నిధులతో రూ.6.37 లక్షలతో మరియు 12 పనులు జనరల్ ఫండ్ నిధులతో రూ.29.26 లక్షలతో రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ సప్లయ్ మరియు ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండర్లను కోరబడుచున్నవి. కావున సదరు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లను ది.09-12-2023వ తేదీ నుండి ది. 15-12-2023 తేదీ వరకు https://tender.apeprocurement.gov.in/ ద్వారా దాఖలు చేసుకోవలసినదిగా తెలియజేయడమైనది.

సం/- కమీషనర్,
జగ్గయ్యపేట మున్సిపాలిటీ.

IN THE COURT OF THE IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE:AT VIJAYAWADA
O.S.No.2411/2022

Between
Ghantasala Anuradha ...Plaintiff
And
Kona Srilatha & Others ...Defendants
Address: Defendant No.2
Kona Sowjanya, D/o.(late)Kona Ramu, Properties, residing at D.No.16-5, Sri Venkateswara Old Gunnis Merchants, Beside Travelers Bungalow, Kankipadu, Krishna District.

పై నెంబర్ దావాలోని రెండోవ ప్రతివాది కి దావా సమన్లు శ్రీ కోర్టు వారు పబ్లికేషన్ ద్వారా ఆర్డర్ వేసి యున్నారు. కావున సదరు రెండోవ ప్రతివాది అయిన కోనా సౌజన్య, ది.27-12-2023 వ తేదీన ఉదయం గం 10-30 నిమిషాలకు శ్రీ కోర్టు వారి ముందు ప్రత్యక్షంగా గానీ లేదా వకీల్ ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా:27-12-2023

T.BHAIRRAJU,
ADVOCATE,
Flat No.GF-1, MAK Grandeur,
Brahmaiahpantulu Street,
Satyanarayanapuram,
Vijayawada-520011,
Ph.No.9848263285.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ
షార్ట్ టెండర్, బాక్స్ టెండర్ ప్రకటన
Short Tender No.01/2023/Arches Date:08-12-2023

గృహ నిర్మాణ సంస్థ, మచిలీపట్టణం డివిజన్ పరిధిలోని **అవనిగడ్డ, మచిలీపట్నం,** పెడన నియోజకవర్గంలోని జగనన్న కాలనీలకు **వెల్కమ్ ఆర్చెస్‌లు** నిర్మాణం చేయుటకు **23** పనులకు అంచనా విలువ **రూ.207.81 లక్షలతో** మంజూరు చేయబడినవి. ఈ 23 పనులకు **షార్ట్ టెండర్ తేదీ: 09-12-2023** నుండి హౌసింగ్ డివిజన్ మచిలీపట్టణం కార్యాలయంలో **బాక్స్ టెండర్లు** ద్వారా కోరబడుతున్నవి.

టెండరు షెడ్యూల్ కొరకు దరఖాస్తు చేయుటకు తేది	: 13-12-2023 - 5.00 PM
టెండరు షెడ్యూలు జారీ చేయు చివరి తేది	: 14-12-2023 - 5.00 PM
టెండర్లను స్వీకరించు చివరి తేది	: 15-12-2023 - 3.00 PM
టెండర్లను తెరచు తేది	: 16-12-2023- 3.30 PM

పూర్తి వివరాలకు మచిలీపట్నం ఫోన్ నెం.**7093930674, 7989146999**లో సంప్రదించగలరు.
అడ్రస్ : డోర్ నెం.20/31, 20వ వార్డు, లక్ష్మిటాకీస్ దగ్గరలో, నరసింహనగర్, మెయిన్‌రోడ్డు, మచిలీపట్టణం.

డివిజన్ హెడ్ హౌసింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, మచిలీపట్టణం డివిజన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ
షార్ట్ టెండర్, బాక్స్ టెండర్ ప్రకటన
Rc.02/VYU/NPI/Arches Date:08-12-2023

గృహ నిర్మాణ సంస్థ, ఉయ్యూరు డివిజన్ పరిధిలోని **పామర్రు, పెనమలూరు** నియోజకవర్గంలోని జగనన్న కాలనీలకు **వెల్కమ్ ఆర్చెస్‌లు** నిర్మాణం చేయుటకు **18** పనులకు అంచనా విలువ **రూ.131.72 లక్షలతో** మంజూరు చేయబడినవి. ఈ 18 పనులకు **షార్ట్ టెండర్ తేదీ: 09-12-2023** నుండి హౌసింగ్ ఉయ్యూరు డివిజన్ కార్యాలయంలో **బాక్స్ టెండర్లు** ద్వారా కోరబడుతున్నవి.

టెండరు షెడ్యూల్ కొరకు దరఖాస్తు చేయుటకు తేది	: 13-12-2023 - 5.00 PM
టెండరు షెడ్యూలు జారీ చేయు చివరి తేది	: 14-12-2023 - 5.00 PM
టెండర్లను స్వీకరించు చివరి తేది	: 15-12-2023 - 3.00 PM
టెండర్లను తెరచు తేది	: 16-12-2023- 3.30 PM

పూర్తి వివరాలకు ఫోన్ నెం.**7093930678, 7093930676** లో సంప్రదించగలరు.

డివిజన్ హెడ్ హౌసింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, ఉయ్యూరు డివిజన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ
షార్ట్ టెండర్, బాక్స్ టెండర్ ప్రకటన
Rc.23/Arches Date:08-12-2023

గృహ నిర్మాణ సంస్థ, గుడివాడ డివిజన్ పరిధిలోని **గన్నవరం, గుడివాడ** నియోజకవర్గంలోని జగనన్న కాలనీలకు **వెల్కమ్ ఆర్చెస్‌లు** నిర్మాణం చేయుటకు **11** పనులకు అంచనా విలువ **రూ.104.93 లక్షలతో** మంజూరు చేయబడినవి. ఈ 11 పనులకు **షార్ట్ టెండర్ తేదీ: 09-12-2023** నుండి హౌసింగ్ ఉయ్యూరు డివిజన్ కార్యాలయంలో **బాక్స్ టెండర్లు** ద్వారా కోరబడుతున్నవి.

టెండరు షెడ్యూల్ కొరకు దరఖాస్తు చేయుటకు తేది	: 13-12-2023 - 5.00 PM
టెండరు షెడ్యూలు జారీ చేయు చివరి తేది	: 14-12-2023 - 5.00 PM
టెండర్లను స్వీకరించు చివరి తేది	: 15-12-2023 - 3.00 PM
టెండర్లను తెరచు తేది	: 16-12-2023- 3.30 PM

పూర్తి వివరాలకు ఫోన్ నెం.**7093930676, 7093930739.** లో సంప్రదించగలరు.

డివిజన్ హెడ్ హౌసింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, గుడివాడ డివిజన్

లీగల్ ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు విజయవాడ
S.O.P.No.44/2023

Between:
1)పైలా అనంతలక్ష్మీ 2)పైలా శ్రీనివాస్ 3)పైలా గురుప్రసాద్ ...పిటీషనర్స్
మరియు
నిల్ ...రెస్పాండెంట్స్

పై నెంబరు పిటీషనర్లు (లేటు) పైలా రాజేశ్వరరావు గార్కి 1వ వారు భార్యను, 2వ వారు, మరియు 3వ వారు, వారసులు అయి ఉన్నారు. సదరు పిటిషనర్లు పై నెంబరు పిటిషన్‌ను (లేటు) పైలా రాజేశ్వరరావు గార్కి షెడ్యూల్‌కు సంబంధించి రావలసిన సొమ్ము రు.13,29,099.01 పైసా రూపాయలు తీసుకొనుటకు గాను SUCSETION CERTIFICATE ను వారి పేరు కోరుతూ పైన తెలిపిన శ్రీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. సదరు పై పిటిషన్ అందు షెడ్యూల్ అమౌంట్ కు సంబంధించి ఎవరికైననూ ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల ది.22-12-2023వ తేదిన పై తెలిపిన కోర్టునందు ఉదయం 10-30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు ఉన్న యెడల తెలియచేసుకోగలరు. లేని యెడల శ్రీ కోర్టు వారు ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి సదరు పిటిషన్ నందు తీర్పును పిటిషనర్లు కోరిన విధంగా తీర్మానించెదరు.

షెడ్యూలు

S.No	Folio No.	Unit Balance	Current Value As on 13-10-23	Nature of Unit
1.	4820684/66	78,728.765	13,29,099-01	Tata Balanced Advantage Fund Regular Plan Growth

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

విజయవాడ,
తేది:5-12-2023

T.BHAIRRAJU, V.R.Suresh,
E.L. Anuradha, B.Bhuvan Reddy, T.V.L.Kiranmai
ADVOCATE, Flat No.GF-1, MAK Grandeur,
Brahmaiahpantulu Street, Satyanarayanapuram,
Vijayawada-520011, Ph.No.9848263285.



వికెఆర్ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం వికేఆర్ కళాశాలలో తొలిసారిగా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన.. విద్యార్థులలో దాగి ఉన్న సజనాత్మకతను వెలికితీయడానికి కషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆహార పదార్థాల ప్రాధాన్యత గురించి తెలియజేయడానికి ఫుడ్ ఫెస్టివల్స్ దోహదప´డతాయన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన బిర్యానీ పాయింట్, చపాతి మెతి చమన్, సూపర్ కట్లెట్, ఐస్ క్రీమ్, వివిధ రకాల వంటకాలు, ఫ్లవర్ బొకేస్, గ్లాసులో బాల్, వివిధ గేమ్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తేజ కుమారి, జనని,జి రాజేశ్వరి,లలితా బాయి,ఎస్ స్వాతి, ప్రమీల, ఉషశ్రీ,, కష్ణ పాల్గొన్నారు.

మత్స్యకారులకు జీవనభృతి కల్పించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : తుఫాను వల్ల చాపల వేట నిలుపుదల చేయడంతో జీవన భృతి కోల్పోయిన మత్స్యకారులకు 2000 రూపాయలు జీవన భృతి కల్పించాలని ఆంధ్రప్రదేశ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నాగాయలంక ఫిష్ ల్యాండింగ్ సెంటర్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల తరచూ చేపల వేటను నిలుపుదల చేయాల్సి వస్తుందన్నారు. అందువల్ల ప్రకతి వైపరీత్యాల కారణంగా సముద్రంలో చేపల వేట నిలుపుదల చేసిన కాలానికి కేరళ ప్రభుత్వం చెల్లిస్తున్న ట్లుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా మత్స్యకారుల జీవన భృతికి సహాయం అందజేయాలని కోరారు. మత్స్యకారుల సంఘం నాయకులు కర్రి కష్ణమూర్తి నాగిడి తాతారావు పాల్గొన్నారు

గుర్రపు డెక్క తొలగింపు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వడ్లమన్నాడు గ్రామ పరిధిలో గల మురుగుబోదులలో ఉన్న తూడు గుర్రపు డెక్కను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో తొలగించే పనులను శనివారం ప్రారంభించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలని నిరసన

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం కప్తాను పాలెం ప్రధాన రహదారిపై మిచాంగ్ తుఫాను వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ తెలుగుదేశం, సిపిఐ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ, జనసేన నాయకులు రత్న గోపాల్, శేషుబాబు లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఉపసభాపతి బుద్ధ ప్రసాద్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ తుపానుతో ఇంత నష్టం జరిగితే మంత్రులు వచ్చి రైతులను పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇవ్వలేకపోయారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం



రాష్ట్రంలో ఇరిగేషన్ వ్యవస్థను సర్వనాశనం చేసిందన్నారు. అక్విడక్ట్ మరమ్మతులు, ఎదురుమొండి జింకపాలెం రోడ్డు కోతకు గురవుతుంటే అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ది కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు...ఆదుకుంటాం

డిసిఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ



పంటలు పరిశీలిస్తున్న స్నిగ్ధ

ప్రజాశక్తి-కంకిపాడు : అన్నదాతలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, అధైర్యపడొద్దని డీసీఎంఎస్ చైర్పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. తుపాను ప్రభావంతో గొడవర్రుగ్రామంలో నీట మునిగిన వరి పొలాలు, వరి పనలను శుక్రవారం ఆమె పరిశీలించారు. వరి సాగుకు అయిన పెట్టుబడులు, పంట దిగుబడులు, కౌలు ఒప్పందాలు గురించి వివరాలు తెలుసుకున్నారు. రైతుకు జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట చేతికొచ్చిన తరుణంలో తుపాను రైతులకు నష్టం చేకూర్చటం బాధాకరమన్నారు. ధాన్యం సేకరణలో నిబంధనలను సడలించి రైతులకు మేలు చేకూరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఆరబో సుకునేందుకు ఉపాధి హామీ కూలీలను వినియోగించు కునేలా చర్యలు తీసుకోవటం సంతోషకరమన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా కల్పించారు

సైనిక సంక్షేమ నిధికి విరాళాలందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : దేశ రక్షణ కోసం సైనికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎంతగానో పాటుపడుతున్నారని, వారి సంక్షేమ నిధి కోసం విరివిగా విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పిలుపునిచ్చారు.సాయుధ దళాల పతాక దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి ఛాంబర్లో జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విరాళాల సేకరణకై సైనిక సంక్షేమ స్టిక్కర్లను ఆవిష్కరించారు అనంతరం సైనిక సంక్షేమ నిధి కోసం ఏర్పాటుచేసిన విరాళాల హుండీని ప్రారంభించి స్వయంగా విరాళాన్ని అందించారు. సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్వో పెద్ది రోజా, మచిలీపట్నం ఆర్డిఓ ఎం. వాణి కూడా స్వయంగా విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత సైనిక దళాలు మొక్కవోని దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల దేశం గర్విస్తోందన్నారు. ఎంతోమంది సైనిక సహోదరులు దేశ రక్షణ కొరకు తమ ప్రాణాలు అర్పించారన్నారు. మనందరం వారికి ఎంతో రుణపడి ఉన్నామన్నారు. వీర జవానులకు వందనం సమర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారి కుటుంబాలకు చేయూతనిచ్చేందు కోసం అందరము సాయుధ పతాక దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పౌరులు వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యా సంస్థలు అందరూ పతాక నిధికి విరివిగా విరాళాలు అందించి మాజీ సైనికుల సంక్షేమానికి తోడ్పడాలన్నారు. ఉమ్మడి కష్ణాజిల్లా సైనిక సంక్షేమ అధికారి డాక్టర్ కె కళ్యాణ వీణ పర్యవేక్షకులు వై ఈశ్వరరావు మాజీ సైనికు ఉద్యోగుల సంఘం సభ్యులు సిబ్బంది తలదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన



గుడివాడరూరల్‌లో పాడైన పంటలు పరిశీలిస్తున్న వెనిగండ్ల రాము

ప్రజాశక్తి, గుడివాడరూరల్: ప్రభుత్వాలు సహకరించకపోయిన రైతులు కలిసికట్టుగా డ్రయిన్లు బాగు చేసుకోవడం అభినందనీయమని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పర్నాస, కల్వపూడి అగ్రహారంలో తుఫానుకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఇంకా వర్షపు నీరు పంట పొలాల్లో ఉండటంతో మొలకలు వచ్చి తీవ్రంగా నష్టపోతామని రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ప్రతి గింజ కొనుగోలు చేసి ఆదుకోవాలని ఆయన డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలంలో తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని కోడూరు మండల టిడిపి శ్రేణులు డిమాండ్ చేశారు. శుక్రవారం 14 కో నెంబర్ కాల్వ క్రింద నీటిలో మునిగి,మొలక వస్తున్న పంట పొలాలను కోడూరు మండలం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా తుఫాన్ తాకిడికి నీట మునిగిన 26 వేల ఎకరాలకు ఎకరానికి 35వేల రూపాయల చొప్పున ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని కోరారు. పంట పొలాలలో నీరు పోయే విధంగా డ్రైనేజీ ఉడికతీత పనులు వెంటనే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశకి- మచిలీ పట్నం రూరల్ : మిచాంగ్ తుఫాన్ వలన కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బ తిన్న వరి పొలాలను కష్ణాజిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వింత సంజీవరెడ్డి పరిశీలించారు. శుక్రవారం బందరు మండలంలోని సుల్తానగరం, బుర్రపోతుపాలెం, తదితర గ్రామాలను పంట పొలాలను సందర్శించి నష్టపోయిన రైతుల నుండి పంట నష్టం అడిగి తెలుసుకున్నారు. అబ్దుల్ మతీన్, నల్లబోలు కుమారి,చంద్రశేఖర్, చిలుకోటి ప్రసాద్, అమ్మాజీ ,శామ్యూల్, గణేష్ ,సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చల్లపల్లి : తుఫాన్ లో నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించాలని కష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వింతా సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిధిలోని వివిధ గ్రామాలలో స్థానిక నాయకులతో కలిసి పర్యటించి నేత మునిగిన పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు స్వయంగా పొలాలను పరిశీలించి పంట నష్టం అంచనా వేయాలని కోరారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీర్ రిజ్వాన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు జగ్గవరపు బాబురావు, ఎస్సీ సెల్ నాయకులు కలతోటి సాల్మన్ రాజు పాల్గొన్నారు .

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల మీ చౌంగు తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు రూ30 వేల నష్టపరిహారం తక్షణమే అందజేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వింత సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాలో తుఫాను వలన దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించేందుకు దివిసీమకు వచ్చినాయన అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అవనిగడ్డ నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త అందే శ్రీరామ్‌మూర్తి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు దిడ్ల వీర రాఘవులు, మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు కోసూరి రామాంజనేయులు, నాగాయలంక మండల పార్టీ అధ్యక్షులు బీమా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కరెంటు స్తంభంపై ఎగసిన మంటలు



ప్రజాశక్తి-చల్లపల్లి : విద్యుత్ స్తంభంపై ఒకసారిగా మంటలు చెలరేగటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే చల్లపల్లి మండల పరిధిలోని లక్ష్మీపురం శివారు రామనగరం పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న కరెంటు స్తంభం పైభాగంలో శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో ఒకసారిగా మంటలు లేచాయి. అకస్మాత్తుగా స్తంభంపై మంటలు ఎగిసిపడటంతో భయభ్రాంతులకు గురైన స్థానికులు ఉలిక్కి పడ్డారు. కొందరు మంటలకు దూరంగా పరుగులు తీశారు. ఎదురుగా పెట్రోల్ బంక్ కూడా ఉండటంతో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. కరెంటు వైర్లకు దగ్గరగా కేబుల్ టీవీ వైర్లు బిగించడం వల్ల చల్లదనానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి కేబుల్ టీవీ వైర్లు కాలిపోవడం వల్ల మంటలు చెలరేగినట్లు చల్లపల్లి ఎలక్ట్రికల్ ఏఈ వర కుమార్ తెలిపారు. ఇటువంటి ప్రమాదాలు మునుముందు జరగకుండా కేబుల్ ఆపరేటర్లు కేబుల్ టీవీ వైర్లను విద్యుత్ తీగలకు దూరంగా కట్టుకోవాలని ఏఈ వర కుమార్ ఆదేశించారు.

జగనన్న కాలనీల్లో పర్యటన

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలో జగనన్న ఇళ్ల కాలనీలలో నీట మునిగిన ఇళ్లను పెడన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి కాగిత కష్ణ ప్రసాద్, పెడన నియోజకవర్గ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు, మండల పార్టీ అధ్యక్షులు కూనపరెడ్డి వీరబాబు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల పంపిణీ చేశామని చెబుతోందని, కానీ నివాసయోగ్యమైన ఇళ్ల స్థలం ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి అంగర రంగనాథ్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఎండ ి నూరు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బోర్రాకాసి పాల్గొన్నారు.

పురందేశ్వరికి సత్కారం



పురందేశ్వరి సన్మానిస్తున్న పొట్లూరి దంపతులు

ప్రజాశక్తి-గన్నవరం : బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరికి ఘన సత్కారం లభించింది. గన్నవరం మండలం కేసరపల్లిలోని శ్రీ హేమ దుర్గా జ్యూయల్ కౌంటి లో శుక్రవారం జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె వచ్చారు. గన్నవరం ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు దంపతులు, జ్యూయల్ కౌంటీ చైర్మన్ చలసాని సురేష్ దంపతులు, పంచాయితీ మాజీ పాలకవర్గ సభ్యులు రాజులపాటి శ్రీనివాసరావు దంపతులు దుశ్యాలవాలను పురందేశ్వరికి కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, ఆ పార్టీ నాయకులు నాదెండ్ల మోహన్, పంచాయతీ వార్డు సభ్యులు జాస్తి శ్రీధర్ బాబు, పొట్లూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక పాలశీతల కేంద్ర ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన పథకాలు ఎంత వరకు నిర్వహిం చామని, ప్రజలకు ఇంకా ఏ విధంగా అందించాలో మొదలగు విషయాలు ఉద్యోగులు చర్చించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశి భూషణ్ ,గుడివాడ ఎన్.టి.ఆర్. స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి , ఎంపీపీ కొడాలి సురేష్ గారు, వైస్ ఎంపీపీ శాయన రవి కుమార్ , ఎంపీడీవో దారపు శ్రీనివాస్, తాసిల్దార్ అబ్దుల్ రహమాన్ మస్తానా, మండలములోని మండల పరిషత్ పరిధిలో గల అన్ని విభాగాల కార్యాలయ సిబ్బంది, తహశీల్దారు కార్యాలయపు సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



28 నుండి పుస్తక మహోత్సవం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 28 వ తేదీ నుండి జనవరి 7వ తేదీ వరకు విజయవాడ పుస్తక మహోత్సవం నిర్వహించనున్నట్లు బుక్ ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షులు బి. బాబ్జీ తెలిపారు. నగరంలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అవరణలో జరుగుతుందని అన్నారు. ప్రతి సారి జనవరి 1న పుస్తక మహోత్సవం ప్రారంభమవుతుందని కానీ ఈ సారి మూడు రోజులు ముందుగా ఈ నెల 28 నుండి ప్రారంభిస్తున్నామని అన్నారు.ఈ పుస్తక మహెూత్సవం ప్రాంగణానికి కీర్తి శేశులు వరహాలు చెట్టి ప్రంగణంగా పేరు పెట్టినట్లు తెలిపారు.28వ తేదీ సాయంత్రం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రారంభిస్తారని అని తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం శత జయంతి సభలు, పుస్తకావిష్కరణ జరుగుతాయని తెలిపారు.ప్రతిభ వేదికపై విద్యార్థులకు వివిధ పోటీలు జరుగుతాయని తెలిపారు. జనవరి 1 వ తేదీన పుస్తక ప్రియుల పాదయాత్ర జరుగుతుందని అన్నారు.పాదయాత్ర సిద్ధార్థ కళాశాల నుండి పుస్తక మహెూత్సవం ప్రాంగణం వరకు జరుగుతుందని అన్నారు.జనవరి 7 వ తేదీన ముగింపు సభ జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఎస్. ఢిల్లీ రావు, మునిసిపల్ కమిషనర్ స్వ ప్నిల్ దినకరన్ పాల్గొంటారని తెలిపారు . విలేకరుల సమావేశంలో బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు మనోహర్ నాయుడు, కార్యదర్శి కె. లక్ష్మయ్య, గోళ్ళ నారాయణ రావు పాల్గొన్నారు.

పొలాల్లో నీటి తరలింపునకు చర్యలు

ప్రజాశక్తి-మొవ్వ: తుపాను వల్ల కురిసిన వర్షాలతో ముంపు పాలైన పంట పొలాల్లో నీటిని తొలగించేందుకు డ్రైనేజీ శాఖ అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. పద్దరాయుడుతోట, కోళ్ల పాలెం, రాచర్ల పాలెం, రామన్నపేట, ఉప్పాయికోడులో గుర్రపుడెక్కతో పాటు ఆటంకాలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఎఇ రాంకుమార్ పర్యవేక్షణలో పొలాలలోని నీటిని కాలువలోకి మళ్లించే ప్రయత్నాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా అయినంపూడి డ్రైన్ పరిధిలో కాజ శివారు మందపాలెం వద్ద గల తన్నేలు బోదు ద్వారా పొలాలలో నీరు బయటకు వచ్చేందుకు వీలుగా ప్రొక్లైనుతో చర్యలు చేపట్టడంతో నాలుగు వేల ఎకరాల్లో నీరు తగ్గిపోతుందని ఆర్బికే చైర్మన్ పేకేటి సీతారామిరెడ్డి వివరించారు.

ప్రమాదవశాత్తు వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: ప్రమాదవశాత్తు వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలోని కానుమోలు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపులపాడు మండలం కానుమోలు గ్రామానికి చెందిన రెల్లి నాగరత్నం (80) డాబాపై బట్టలు ఆరేస్తూ కాలుజారి కింద పడి శుక్రవారం మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కుమారుడు రెల్లి సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హనుమాన్ జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్ధన్ తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి : వీర్ల

ప్రజాశక్తి-మొవ్వ: తుపానుతో కురిసిన వర్షాలు గ్రామాలను అతలాకుతలం చేశాయని, ఈ నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది శానిటేషన్ పై దష్టి సారించి అంటు రోగాలు ప్రబలకుండా చూడాల్సిన బాధ్యత ఉందని మొవ్వ మండల పంచాయతీల విస్తరణ అధికారి వీర్ల సీతారామరాజు సూచించారు. మొవ్వ ఎండిఓ కార్యాలయంలో వి సుధా ప్రవీణ్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సాధారణ పరిపాలన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ కార్యదర్శులకు, దీనిపై పలు సూచనలు ఇచ్చారు. వల్ల ప్రాంతాలలో నీటిని తొలగించి బ్లీచింగ్ గ్రామాలను పరిశు భ్రంగా తీర్చిదిద్దాలన్నారు.

మహిళలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రముఖ వైద్య నిపుణులు అక్కినేని మణి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రతి మహిళ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్స్ ఛైర్‌పర్సన్, ప్రముఖ మహిళా వైద్య నిపుణురాలు డాక్టర్ అక్కినేని మణి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల యుజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు, మహిళలకు వైద్య పరీక్షలతో పాటుగా మహిళా ఆరోగ్య సమస్యలపై అవగాహనా సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అక్కినేని మణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదోక వ్యాధి వచ్చినప్పుడే ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలను చేయించుకోవటం జరుగుతుందన్నారు. అయితే ఒక వయస్సు వచ్చిన తరువాత ప్రతి ఒక్కరూ జనరల్ హెల్త్ చెకప్‌లను చేయించుకోవటం అవసరసమన్నారు. తద్వారా ఏదైనా సమస్య ఉంటే ముందుగా గుర్తించటానికి అవకాశముంటుందని, చక్కని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని సూచించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం సైతం సమస్యలకు దూరంగా ఉంటుందన్నారు. ప్రధానంగా ఇటీవల ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా చాలా అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయన్నారు. బాలికలు తమ జీవనశైలిని క్రమశిక్షణాయుతంగా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. పౌష్టికాహారం, వ్యాయమం, క్రమశిక్షణాయుత జీవనశైలితో ఆరోగ్యంతో పాటుగా చక్కని విజయాలను సైతం అందుకోవచ్చని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు మాట్లాడుతూ తమ కళాశాలలో సగానికి పైగా విద్యార్థినులు ఉన్నారన్నారు. వారందరికీ చక్కని ఆరోగ్యాన్ని అందించేందుకు ఎప్పటికప్పుడు పలు అవగాహనా సదస్సులను నిర్వహిస్తున్నామని వివరించారు. విద్యార్థినులు ఆయా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అక్కినేని మహిళా హాస్పిటల్స్ వైద్యులు విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. అలాగే ఆయుర్వేద శిబిరాన్ని సైతం నిర్వహించారు. కార్యక్రమాన్ని స్టడీ సెంటర్ వీ. శైలజ నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జీ. కష్ణవేణి, వైద్య నిపుణులు డాక్టర్ ధర్మజ దండమూడి, డాక్టర్ సౌమ్య దావులూరి, డాక్టర్ స్ఫూర్తి రామినేని, డాక్టర్ ఎం. సుస్మితరెడ్డి, డాక్టర్ పద్మజ రుద్రరాజు తదితరులు ఆయా అంశాలపై ప్రసంగించారు.



మాట్లాడుతున్న వైద్య నిపుణురాలు అక్కినేని మణి

వాగ్దేవి నర్సింగ్ కళాశాల ప్రారంభం



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసి వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని కోదాడ రోడ్డు వాగ్దేవి మహిళా కళాశాల వారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాలను శు క్రవారం రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను, యువ నాయకులు సామినేని వెంకటకృష్ణప్రసాద్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రోజురోజుకు పారిశ్రామిక వాడగా అభివద్ధి చెందుతున్న జగ్గయ్యపేట ప్రాంతంలో వైద్య సేవలను మరింత అభివద్ధి పరిచేందుకు మొట్టమొదటిసారిగా నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గతంలో బీఎస్సీ నర్సింగ్ చదవాలి అంటే సూదూరప్రాంతాలకు వెళ్లి కోర్సు చేయడానికి విద్యార్థులు అవస్థలు పడేవారని, అలాంటిది నేడు జగ్గయ్యపేట నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మహిళా నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయడం హర్షనీయామన్నారు. బిఎస్సి నర్సింగ్ చదువుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంకిపాడులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-కంకిపాడు: బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారంటీ టిడిపి సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కంకిపాడు 172వ బూత్ పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోగినేని వెంకట రమణరావు, కొండా నాగేశ్వరరావు, అన్నవరపు శివపార్వతి, పులి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ రమేష్‌బాబు పరామర్శ

ప్రజాశక్తి-ఘంటసాల: మండలంలోని లంకపల్లి గ్రామంలో వైసీపీ కార్యకర్త కొల్లూరి శ్రీనివాసరావు ఇటీవల చనిపోయారు. వారి కుటుంబ సభ్యులను అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా కొల్లూరి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, సచివాలయ మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, వైసీపీ నాయకులు కొల్లూరి పద్మారావు పాల్గొన్నారు.

10న ఆర్యవైశ్యుల వన సమారాధన

ప్రజాశక్తి-భవానీపురం: కార్తీకమాసం సందర్భంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, శ్రీ వాసవి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన గొల్లపూడిలోని పద్మావతి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య వైభవం పేరిట కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘాల నాయకులు చెప్పారు. శు క్రవారం భవానీపురం ఆలివ్ గ్రీన్ హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీ వాసవి ఫౌండేషన్ అధ్యక్షులు వి.వి.కె. నరసింహారావు, డూండీ రాకేష్‌లు మాట్లాడుతూ 10వ తేదీన గొల్లపూడి అయ్యప్పస్వామి గుడి సమీపంలోని పద్మావతి కల్యాణ మండపంలో సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది తాము నిర్వహించాల్సిన కార్తీక వన సమారాధనను పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి కావాలనే పోలీసులతో తమకు అనుమతులు లేవంటూ అడ్డుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నాయకులు కొణిజేటి రమేష్, దరిశ శ్రీనివాస్, పారేపల్లి రాకేష్ (డూండీ రాకేష్), తుమ్మలపెంట శ్రీనివాసులు, అంజిబాబు, చారుగుండ్ల రమేష్, నూకల నాగేశ్వరరావు, గణేష్, జాలాది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహారావు, డూండీ రాకేష్

జెమ్ అండ్ జ్యూయలరీ ఫెయిర్ ప్రారంభం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: ఎపి బులియన్ గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్ అసోసియేషన్, యునైటెడ్ ఎగ్జిబిషన్స్, చెన్నైవారి సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఎస్.ఎస్.కన్వెన్షన్ హాల్లో శుక్రవారం జెమ్ అండ్ జ్యూయలరీ ఫెయిర్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎపి బులియన్ గోల్డ్ సిల్వర్ మరియు డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపిల్వాయి విజయ కుమార్ మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన జ్యూయలరీ ఉత్పత్తిదారులు, హోల్‌సేల్ వ్యాపారస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని అన్నారు. వ్యాపారస్తులను అభినందిస్తూ ఇటువంటి ప్రదర్శనల వల్ల జ్యూయలర్స్ వేరే ప్రాంతాలకు వెళ్ళే అవసరం లేకుండా వారు వున్న చోటునే కొనుగోలు చేసుకునేందుకు ఎపిజిజెఎఫ్ ఒక సదావకాశం అని తెలిపారు. యునైటెడ్ ఎగ్జిబిషన్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వి.కె.మనోజ్ మాట్లాడుతూ ఈ సారి నిర్వహిస్తున్న 2వ ఎడిషన్ అయిన ఈ బి2బి ఎగ్జిబిషన్ గత సంవత్సరం కన్నా పెద్దదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చీఫ్ స్టేట్ ఆర్గనైజర్ శాంతిలాల్ జైన్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ శంకరరావు బొమ్మిశెట్టి, రాష్ట్ర కోశాధికారి సేఠ్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

